# వజ్ర కిరీటం

ఎ. యస్. రావ్

(గత సంచిక తరువాయి)

## 12

అతను పద్మాసనం వేసుకొని, మంచంమీద వినాయకుడిలా కూచున్నాడు. చేతికి అందేంత దూరంలో వున్న టెలిఫోన్ మీదే అతని చూపులు నిలిచాయి; మూత పెట్టిన పాలగిన్నెమీదున్న పిల్లి చూపుల్లా అసహనంగా. అతను నాలుగు చెంచాల పాన్‌పరాగ్‌ని నోట్లో పోసుకున్నాడు. కరకర నములుతూ ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించాడు. ఇరవై నిమిషాల క్రితమే ఫోన్ మోగి వుండాలి. అతనెందుకు ఇంకా తనని కాంటాక్టు చేయలేదు? చివరి నిమిషంలో మనసు మార్చుకొని, లంకెబిందెలతో లేక ఉడాయించాడా? నగ్నంగా వున్న తన ఛాతీని, బొజ్జనీ అతను అరచేత్తో రుద్దుకున్నాడు. మోసం జరిగితే తను ఏం చేయాలి?

సలుపు పుట్టిస్తూ అతనిలో సాగుతున్న వెయ్యి ఆలో

చనల్ని చెల్లాచెదురు చేస్తూ టెలిఫోన్ మోగింది. ఉలిక్కి-పడిన అతని చేతిలోంచి సిగరెట్ కిందికి జారింది. ఏనుగు తొండంలాంటి అతని చెయ్యి రిసీవర్ని తటాలున లాగి, చెవికి ఆన్చింది.

“యస్!” అన్నాడతను బొంగురుగా.

“మిస్టర్ గుప్తా, సరుకు మీ గోడౌన్‌లో డెలివరీ ఇవ్వబడుతుంది. బిల్లు పైకం రెడీగా వుంచండి....” అవతలి కంఠం స్పష్టంగా, సన్నగా ధ్వనించింది.

గుప్తా మొహం వెడల్పుగా సాగింది. అతని కళ్ళు వజ్రాల్లా మెరిశాయి. “వెల్‌కమ్! త్వరగా రండి!” ఉత్సాహంతో అరిచాడతను.

“పది నిమిషాల్లో అక్కడుంటాను.”

“ఒక్క క్షణం........ఇప్పుడెక్కడున్నావు?” గుప్తా ఆత్రంగా అడిగాడు.

“అది మీకు అనవసరం!” అవతలి కంఠం కటువుగా అంది.

“నాన్సెన్స్! అది అత్యవసరం! లాస్టు మొమెంట్‌లో ఎవరైనా నిన్ను ఫాలో చేస్తూ నా దగ్గరికి రావచ్చు. అలా జరగడం నాకు ఇష్టంలేదు. ఎక్కడున్నావో చెప్తే, ఎలా ఇక్కడికి రావాలో చెప్తాను....” గుప్తా తొందర తొందరగా అన్నాడు.

బొంగురు కంఠం సగర్వంగా అతని చెవిలో నవ్వింది.

“మిస్టర్ గుప్తా, అరణ్యంలో ఎలా నడవాలో వేటాడే సింహానికి ఎవ్వరూ చెప్పనక్కర్లేదు! బీ రెడీ అండ్ కీప్ ఎవ్వరిథింగ్ రెడీ!”

ఫోన్ క్లిక్ అంది. గుప్తా నిట్టూరుస్తూ రిసీవర్ని పెట్టేశాడు. అతని యెడమ చెయ్యి మంచంకిందికి పాములా

సాగింది. చూపుడువేలు చిన్న నాబ్‌ని నొక్కింది. గుప్తా ఉషారుగా కొత్త సిగరెట్ వెలిగించాడు.

ఐరన్ సేఫ్ డోర్‌లా వున్న తలుపు చప్పుడు కాకుండా తెరుచుకుంది. చప్పుడు చేయకుండా అక్కడ ప్రత్యక్షమైన వ్యక్తిని గుప్తా చిరునవ్వుతో చూశాడు.

అతను సన్నగా, పొడుగ్గా వున్నాడు. నల్లటి వెంట్రుకలతో నిండిన అతని ముంజేతులు ఎలుగ్గొడ్డు కాళ్ళలా వున్నాయి. పల్చటి జుట్టు నున్నగా వెనక్కి దువ్వబడింది. బాగా బలిసిన గొంగళిపురుగుల్లా వున్న కనుబొమలు మధ్యలో కలుసుకున్నాయి. వాటికింద చిన్నచిన్న కళ్ళు నల్లటి తెరలోని రెండు చిల్లుల్లా అవుపిస్తున్నాయి. రెండు చెవుల్లోంచీ పొడుగ్గా పొడుచుకువచ్చిన వెంట్రుకలు విసరడానికి ఎవరో పట్టుకున్న విసనకర్రల్లా వున్నాయి. పొగ మారిన పెదవుల సందులోంచీ పసుప్పచ్చరంగులో ఉన్న గొగ్గిరిపళ్ళని చూపిస్తూ అతను గుప్తా వైపు నవ్వుతున్నాడు.

గుప్తా అతన్ని దగ్గరగా రమ్మని సైగచేశాడు. అతను నీడలా కదిలి గుప్తా దగ్గరగా ఆగాడు. అతను నడుస్తూంటే ఏమాత్రం చప్పుడూ అవలేదు.

“మంగూ, కాస్సేపట్లో వెన్న మనకి డెలివరీ ఇవ్వబడుతుంది. పావు గంటలో అది కరిగి, ఆకారం మారిపోవాలి! అర్థమైందిగా?” గుప్తా నవ్వుతూ అడిగాడు.

మంగూ తల వెనక్కి ముందుకీ ఊగింది.

“సరుకు ఇచ్చినతనికి మనం పేమెంట్ ఇవ్వాలి. రెడీగా ప్యాక్ చేశావా?” గుప్తా మళ్ళీ ప్రశ్నించాడు.

“సూట్‌కేసులో సర్ది వుంచాను....” మంగూ కంఠం ఎద్దు కాలికింద నలిగిన బోదురుకప్ప కంఠంలా ఉంది.

"గుడ్. వెళ్ళి మేడగదిలో కిటికీ ముందు నిలబడు. బీరువాలోంచి పవర్‌ఫుల్ బైనాక్యులర్స్ తీసుకెళ్ళు. పార్టీ ఒకడే వస్తున్నాడో, వెంట ఎవరేనా వున్నారో చూడు. మన కాంపౌండ్‌లో ప్రవేశించే అతన్ని మరెవరేనా రహస్యంగా ఫాలో అవుతున్నారేమో జాగ్రత్తగా గమనించి, తిరిగిరా. నువ్వొచ్చేదాకా అతనితో బేరమాడుతూ వుంటాను" చెప్తూ అధికారపూర్వకంగా అన్నాడు.

మంగూ మరబొమ్మలా కదిలాడు. కాస్సేపట్లో అతన్ని మాయం చేస్తూ తలుపు మూసుకుంది....

## 13

చిన్న గదిమధ్యలో వున్న కుర్చీలో బలరామ్ ఠీవిగా కూచున్నాడు. వయిట్ సూట్‌లో వున్న అతని ముందు ముగ్గురూ వరసగా నిలబడ్డారు. అంతకు ముందే గీయబడిన వాళ్ళ గెడ్డాలు నున్నగా మెరుస్తున్నాయి. పంచాలాల్చీ తీసేసిన విశ్వకర్మారావు తన మామూలు దుస్తులు—పైజామా, లాల్చీ—ధరించాడు. ఆనందంతో నిండిపోయి ఉబ్బినట్టున్న వాళ్ళ మొహాల్లోకి బలరామ్ చిరునవ్వుతో చూశాడు. పెదవుల చివర్లలో వంకీలు తిరిగిన సన్నటి మీసాల్ని సగర్వంగా వేలితో తడుముకున్నాడు.

"నేను అయిదునిమిషాల్లో బయల్దేరుతాను. నా అంచనా ప్రకారం పన్నెండు తరువాత, తిరిగొస్తాను; సరుకును క్యాష్‌గా మార్చుకుని. తరువాత ఎవరి వాటా వాళ్ళకి పంచబడుతుంది........" బలరామ్ ఆగి, చూశాడు.

విశ్వకర్మారావు కళ్ళద్దాల్ని తీసి, ఆవేశంతో తుడిచి, మళ్ళీ తగిలించాడు. రాంజోగి ఉద్రేకంతో మెటికలు

విరుచుకొని, ధారాళంగా నవ్వుతూ చూశాడు. గజపతి కళ్ళలో తడి విపరీతంగా ఎక్కువైంది.

"విశ్వకర్మారావ్, వాటాలు పంచుకున్నాక మీరు వాళ్ళు మరిచిపోకూడదు! అకస్మాత్తుగా మీకు ఐశ్వర్యం అబ్బినట్టు లోకానికి అనుమానం రాకూడదు. కనీసం ఏడాదిపాటు మీరు ముగ్గురూ గతంలోలాగే సింపుల్ గా జీవించాలి. వెలుగు వెలిగే ప్రయత్నం చేశారా, అందరం ఆరిపోతాం!" బలరామ్ నవ్వుతూ అన్నాడు.

విశ్వకర్మారావు నిరుత్సాహంగా చూశాడు. "వడ్డించిన విస్తరిముందు నోరూ చేతులు లేనివాడిలా కూచోడం అంత సులువైన పనికాదు! నూర్చిన పంటను నోరారా తినడం నా కిష్టం ...."

బలరామ్ అతని మొహంలోకి తీక్షణంగా చూశాడు. "విశ్వకర్మారావ్, కోసుకున్న పళ్ళను గుట్టుచప్పుడు కాకుండా తిను! నువ్వు తినడం ఇతర్లకు కనబడకూడదు; త్రేన్చడం ఇతర్లకి వినపడకూడదు!"

విశ్వకర్మారావు మాట్లాడకుండా, జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. బలరామ్ సలహా అతనికి నచ్చలేదని అతని వాలకం చెప్తోంది.

గజపతినీ, రాంబోగినీ చూశాడు బలరామ్. "నేను చెప్పింది మీ బుర్రల్లోకి ఎక్కిందా?"

ఇద్దరూ బుర్రలు ఆడించారు. "అర్నెల్లు గడిచేదాకా అతి సాదాగా బతుకుతాం. ఆ తరువాత ఏదో మారుమూల ప్రదేశాలకు కలస వెళ్ళిపోయి, కొత్త జీవితం ప్రారంభిస్తాం!" అన్నాడు గజపతి నవ్వుతూ....అవునన్నట్టు రాంభోగి తలాడించాడు.

"విశ్వకర్మారావ్, అంతా ఒకేసారి అందిస్తే నీకు

అజీర్తి చేసేలా వుంది! వాయిదాల పద్ధతిమీద కొద్ది కొద్దిగా ఇస్తాను" బలరామ్ కంఠంలో ఏదో నిర్ణయం గంటలా ధ్వనించింది.

విశ్వకర్మారావు వేళ్ళ సందుల్లోంచీ సిగరెట్ కిందికి జారిపడింది. సిగరెట్‌ని మరిచిపోయి అతను కంగారుగా బలరామ్ మొహంలోకి చూశాడు. బలరామ్ మొహంలో వ్యంగ్యం కనిపించడంలేదు.

"అయామ్ సారీ....మిస్టర్....బల....సారీ బాస్....మీరు చెప్పినట్టే జాగర్తగా వుంటాను. ఏడాది కాకపోతే, రెండేళ్ళపాటు ఇదే పైజామా జుబ్బాతో గడిపేస్తాను....ఇన్‌స్టాల్‌మెంట్స్ వొద్దు. ఒకేసారి, ఈ రోజే నా వాటా నాకు పంచండి!" అన్నాడతను కంగారుగా.

బలరామ్ చిన్నగా నవ్వాడు. "మీ ముగ్గుర్నీ నమ్ముతున్నాను. ఈ క్షణందాకా ఎంత జాగర్తగా వున్నామో, ఇకముందు కూడా, జరిగిందాన్ని అంతా మరిచిపోయేదాకా—అంతే జాగర్తగా వుండాలి. మీ ముగ్గుర్నీ ఓ కంట కనిపెట్టి వుంటాను. రెక్కలు పూర్తిగా విప్పితే, కత్తిరించేస్తాను!"

ముగ్గురూ గతుక్కుమంటూ చూశారు. గజపతి ముందుగా తెప్పరిల్లాడు. తడికళ్ళలో చిరునవ్వుతో చూశాడు. "మన క్షేమం కోసమే మీరు యిదంతా చెప్తున్నారు. మీ సూచనల్ని ఖచ్చితంగా పాటిస్తాం!"

"అది మీకే మంచిది!" అంటూ బలరామ్ కుర్చీలోంచి లేచాడు. "నేను తిరిగొచ్చేదాకా మీ రిక్కడే వుండండి!"

విశ్వకర్మారావు కిందికి వొంగి ఆరిపోతున్న సిగరెట్‌ని

అందుకున్నాడు. "బాస్ ....ఇక్కణ్నుంచీ బరువు మోసుకుంటూ వెళ్ళాలంటే కంగారుగా వుంది. నా యింట్లో నేలమాళిగలో వుంటాం. మీరు....మీరు అక్కడికే రండి...." అన్నాడతను తడబడుతూ.

బలరామ్ అతన్ని చిరునవ్వుతో చూశాడు. "అదే మంచిదనిపిస్తోంది. నువ్వు సులువుగా ఎక్సైట్ అయిపోతావు. కిరీటాన్ని చూస్తూన్నప్పుడు శోషొచ్చి పడిపోతావేమో అనుకున్నా!" అంటూ మంచం కిందున్న వెడల్పాటి లెదర్ బాగ్ ని అందుకున్నాడతను.

"పన్నెండున్నర దాటేక ...."

"బాస్, వస్తారుగా?" విశ్వకర్మారావు వణికే కంఠంతో ప్రశ్నించాడు.

రెండడుగులు వేసిన బలరామ్ తటాలున ఆగాడు. మెల్లిగా తల తిప్పి విశ్వకర్మారావుని తదేకంగా చూశాడు. విశ్వకర్మారావు మొహం యెందుకో చెమటతో తడుస్తోంది. అతని కళ్ళు అద్దంబిళ్ళలా మినుకు మినుకుమంటున్నాయి.

"విశ్వకర్మారావ్, బుద్ధితక్కువ ప్రశ్న వేశావ్! నేను రాను. మొత్తం సొమ్ముతో పరారై పోతాను; మీ అందరి నోళ్ళలో దుమ్ముకొట్టి! తెల్లారేక పోలీస్ స్టేషన్ కెళ్ళు. అప్రూవర్ గా మారిపో. నా గురించి నీకంతా తెలుసు. అంతా చెప్పేయ్. గజపతీ, రాంజోగీ సాక్ష్యం పలుకుతారు. తరువాత పోలీసులు వేటాడి నన్ను పట్టేస్తారు. పట్టిచ్చిన మిమ్మల్ని వొదిలేస్తారు. అప్పుడు, మిత్రద్రోహం చేసిన బలరామ్ కి తగిన శిక్ష విధించిన తృప్తి మీకు మిగులుతుంది! ఓకే?" బలరామ్ గంభీరంగా అన్నాడు.

విశ్వకర్మారావు రెప్ప వేయడం మరచిపోయి చూస్తూండిపోయాడు, ఎగతాళిగా బలరామ్ అన్న మాట లోని అంతరార్థం గ్రహించడానికి అతనికి రెండు క్షణాలు పట్టింది. మెల్లిగా కదిలి బలరామ్ చేతిని పట్టుకొన్నాడు.

"బాస్ ...క్షమించండి. బెల్లంరాశిని చూసిన చీమలా బెంబేలు పడిపోయాను!" అతని కంఠం వణికింది.

బలరామ్ చిన్నగా నవ్వాడు. "విశ్వకర్మారావ్, చీమ లాగే చివరిదాకా ఉండొద్దు. ఎదుగు!"

విశ్వకర్మారావు గుటకలు మింగుతూ చూశాడు. బల రామ్ దూరం దూరంగా అంగలు వేసుకుంటూ గుమ్మం వైపు కదిలాడు.

"బాస్ .." విశ్వకర్మారావు కంఠం అతన్ని ఆపింది. వెనుదిరిగి విసుగ్గా చూశాడతను.

"మళ్ళీ ఏమిటి?"

"బాస్ ... కుంకుమ....ఎక్కడుంది? వాటా...." విశ్వ కర్మారావు కంఠం మూగవోయింది.

"ఎక్కడ వుండాలో అక్కడుంటుంది. ఆమెకి చేరా ల్సింది ఆమెకి చేరుతుంది నీకు...."

"బాస్ ....అంత డబ్బు చేతికొచ్చాక ఆడదానికి.... మగతోడు వుండటం మంచిది...." విశ్వకర్మారావు అడ్డు తగుల్తూ అన్నాడు.

బలరామ్ వడగళ్ళలాంటి కళ్ళతో అతని మొహాన్ని తీక్షణంగా, పరిశీలనగా చూశాడు.

"విశ్వకర్మారావ్, మగతోడుగా నువ్వుంటావా?" బలరామ్ సూటిగా ప్రశ్నించాడు.

విశ్వకర్మారావు బలవంతంగా చిరునవ్వు నవ్వాడు.

అరచేతిని హస్తసాముద్రికుడిలా క్షణకాలం చూసుకున్నాడు. "భార్య చనిపోయాక, పదేళ్ళుగా ఇలాగే ఒంటరిగా ఉండిపోయాను. ఇప్పుడు హాయిగా జీవించడానికి అవకాశం చిక్కింది....కుంకుమని నాకు తోడుగా చేసుకొని, ఆమె తోడుగా....ఉంటానికి నాకు అభ్యంతరం లేదు....కుంకుమ....మీరు చెప్తే అంగీకరిస్తుంది...." అతని కంఠంలో ఆశా, సిగ్గూ పెనవేసుకొన్నాయి.

బలరామ్ పగలబడి నవ్వాడు. విశ్వకర్మారావు తటాలున తలెత్తి చూశాడు. "విశ్వకర్మారావ్, కుంకుమని నమ్ముకుంటే నువ్వు నెలతిరక్కముందే విభూతి రాసుకుని బైరాగుల్లో కలిసిపోతావ్? కుంకుమని మరిచిపో. నీ జేబుల్లో డబ్బు చేరుతుంది. ఏ పసుపునో, కాటుకనో కట్టుకుని గుట్టుగా బతుకు!" బలరామ్ నవ్వుతూ అన్నాడు. గజపతీ, రాంజోగీ నవ్వారు.

"బాస్...." దెబ్బతిన్న విశ్వకర్మారావు ఏదో గొణగబోయాడు.

"విశ్వకర్మారావ్, యూ ఆర్ వేస్టింగ్ టైమ్. నువ్వు నకిలీ వస్తువుల ఎక్స్‌పర్ట్‌వి. కుంకుమ లాంటి అసలు వస్తువుల్ని నీ చేతుల్లో పట్టుకోలేవు! గుర్తుంచుకో!" బలరామ్ గదిలోంచి వెళ్ళిపోయాడు....

## 14

సడెన్ బ్రేకుతో కారాపి, డిటెక్టివ్ టెంపో తన పక్కనే కూచున్న ఐ.జీ.ని చూశాడు.

"మీరు దిగిపొండి. ఫోను ముందు కూచోండి. ఏదైనా తెలియగానే తెలియజేస్తాను" అన్నాడతను.

"మిస్టర్ టెంపో, ఎక్కడికెళ్తున్నారు?" ఐ.జీ.

ప్రశ్నించాడు.

"తెలీదు."

ఐ.జీ. ఆశ్చర్యంగా చూశాడు. "ఏం చేయాలనుకుంటు న్నారు?"

"తెలీదు" టెంపో నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ టెంపో...." ఐ.జీ. అర్థంకానట్టు చూస్తూ ఆగాడు.

"ఏదో చెయ్యాలి. ఎక్కడికో వెళ్ళాలి మీరు రెస్టు తీసుకోవాలనుకొంటే ఎవర్నైనా తగిన ఆఫీసర్ని ఫోన్ ముందు కూచోబెట్టండి...."

"మిస్టర్ టెంపో, పర్వతం రోడ్డుని బ్లాక్ చేసినట్టే, సిటీ రోడ్లన్నీ బ్లాక్ చేయించి వుంటే బావుండేది. కంగారులో మరచిపోయాం. పైగా అసలు వ్యక్తులు అప్పటికి కిందికి దిగలేదని అనుకున్నాం...." ఐ.జీ. నిట్టూర్చాడు.

"నెవర్ మైండ్. ప్రవహించుకుపోయిన నీళ్ళ గురించి విచారించడం దండగ. ఏమీ జరగనట్టు పోలీసులు ఊరుకోడం మంచిది. స్వామీజీ ధరించిన కిరీటం అసలుదే అని అందరూ అనుకొంటున్నారని 'వాళ్ళు' అనుకోడం మంచిది" టెంపో నవ్వుతూ అన్నాడు.

"అయితే మీరే...."

"నేనే ప్రయత్నిస్తాను. ఏదో క్లూని ఆధారం చేసుకొని వాసన పట్టుకుంటూ వెళ్ళాలి!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ టెంపో, క్లూ ఏదీ లేదనుకుంటాను...." ఐ.జీ. సందేహిస్తూ అన్నాడు.

"ఆనవాళ్ళు లేకుండా ఎవ్వరూ అడుగులు వేయలేరు"

టెంపో నవ్వుతూ అన్నాడు.

ఐ.జీ. డోర్ తెరిచి కిందికి దిగాడు. "ఆల్ రైట్! మీ ప్రయత్నంలో మీ రుండండి. మా వాళ్ళతో చర్చించి, మేం చేయాల్సింది చేస్తాం. నేను ఫోన్ దగ్గరే వుంటాను."

టెంపో కార్ని ముందుకి పోనిచ్చాడు. అతని కళ్ళు రోడ్డు రెండువైపులా యెవరికోసమో వెతుకుతున్నాయి. అయిదు నిమిషాల తర్వాత అతని కళ్ళు మెరిశాయి. వీధి లైటు కింద. మలుపు దగ్గరగా పేవ్ మెంటుమీద ఆ వ్యక్తి నిలబడ్డాడు. అతని వేళ్ళమధ్య సిగరెట్ కాలుతోంది. అతని దగ్గరగా కారాపి, టెంపో ఎడంచేత్తో డోర్ని తెరుస్తూ తోశాడు. వయిట్ డ్రెస్‌లో వున్న ఆ వ్యక్తి కార్లో యెక్కి డోర్ని మూసేశాడు, కారు కదిలింది.

"ఏమిటి కథ?" డిటెక్టివ్ టెంపో రోడ్డుని చూస్తూ అడిగాడు.

"పువ్వులు సప్లై చేసే డజనుమంది వ్యక్తుల్ని కలుసుకున్నాను, మైసూరు మల్లెలు మన ప్రాంతంలో దొరకవన్న మీ అనుమానం మంచి పునాది! 'సిటీ ఫ్లవర్ సప్లైయర్స్'లో యెవరో బోలెడన్ని మైసూరు మల్లెలు ఆర్డరిచ్చారు. పాపం వాళ్ళు బొంబాయినుంచీ స్పెషల్ ఆర్డర్ మీద పాతికకిలోల మైసూరు మల్లెల్ని తెప్పించా ...."

"ప్రభంజనం, ఆర్డరిచ్చిన వ్యక్తి యెవరు?" డిటెక్టివ్ టెంపో అడ్డొస్తూ అడిగాడు.

"పల్చటి తెల్లచీరా, పల్చటి తెల్ల జాకెట్టూ...." ప్రభంజనం నవ్వుతూ అన్నాడు.

టెంపో చిన్నగా విజిల్ వేశాడు. "సో, అనదర్

ఫిమేల్ మెంబర్! పల్చటి తెల్లచీర జాకెట్ల కోసం మనం వెతకాలి!"

"టెంపోగారూ! అలాంటి పల్చటి తెల్లటి స్త్రీ దుస్తుల్ని యాక్సిడెంటల్ గా చూశాను...." ప్రభంజనం నవ్వుతూ అన్నాడు.

"ఎక్కడ? యిప్పుడు?" అప్రయత్నంగా బ్రేక్ నొక్కుతూ టెంపో ప్రశ్నించాడు.

"ఎవరో, యేదో అడగడానికి పబ్లిక్ బూత్ దగ్గర ఆగాను. బూత్ లో తెల్లచీరా, తెల్ల జాకెట్ కోకిల కంఠంతో...."

"కమాన్! ఆ సంభాషణ విన్నావా?" టెంపో అడ్డొస్తూ అడిగాడు.

"అలసిపోయి, బూత్ కి ఆనుకొని సిగరెట్ కాలుస్తూ నిలబడ్డాను.... సంభాషణ—వన్ సైడెడ్ సంభాషణ—విన్నాను...." ప్రభంజనం తను విన్న సంభాషణని వివరించాడు.

డిటెక్టివ్ టెంపో ఆవేశంతో అతని చేతిని పట్టుకొన్నాడు.

"తరువాత?"

"తరువాత ఆమె యివతలికి వచ్చింది. ఆమె రాసుకున్న ఖరీదయిన సెంటు గాల్లో వ్యాపించింది. రోడ్ సైడ్ రోమియోలా ఆమెనే చూస్తూ ఉండిపోయాను. నా చూపుల్ని అపార్థం చేసుకొంది. కోపంగా కారును తోలుకెళ్ళిపోయింది...."

"ఆమె ఎలా వుంది?"

"కన్నార్పకుండా వారంరోజుల పాటు చూస్తూ

కూచోవచ్చు!" ప్రభంజనం నవ్వుతూ అన్నాడు.

టెంపో వోరగా అతన్ని చూశాడు. ప్రభంజనం చిన్నగా నవ్వాడు.

"బాబ్డ్ హెయిర్, పచ్చటి జామపండు లాంటి రంగు, నుదురు మీద నిర్లక్ష్యంగా తగిలించుకొన్న కుంకుమ...."

"....ప్రభంజనం.... కారు నెంబర్ చూశావా....?" టెంపో ప్రశ్నించాడు.

"నెంబరు కోసం చూశాను. నెంబర్ ప్లేటు లేదు...."

"కారుకి నెంబర్ ప్లేటు లేదంటే దానికి కారణం ఉంటుంది!" టెంపో ఉషారుగా అన్నాడు.

"అందుకే ఆమె గురించి నాకు అనుమానం వేసింది. పూలు కొన్న ఆడదీ, ఈమే ఒక్కరే అన్న అనుమానం నాలో నమ్మకంగా యేర్పడింది. అనుమానం ధృవపడ్డానికి కాస్త టైమ్ పట్టింది. ఆలోగా కారులో ఆమె మాయమయిపోయింది! అఫ్‌కోర్స్ ఆమె ఎడంవైపు రోడ్లోకి తిరిగింది...."

"లాభం లేదు! సిటీలో కారు వెళ్ళిన దారినిబట్టి గమ్యస్థానం కనుక్కోలేం! ఆల్‌రైట్! నేను కావాలన్న యితర వివరాలు...." టెంపో ఆగి సిగరెట్ ముట్టించాడు.

"హస్తలాఘవంతో సంబంధం వున్న పాత నేరాలన్నింటినీ పరిశీలించాను. వివిధ పత్రికల క్రైమ్ రిపోర్ట్సునీ పోలీసులు నమోదు చేసిన వివిధ నేరాల్నీ స్టడీ చేశాను. నకిలీ కిరీటం తయారు చేయడంలో ప్రదర్శించబడిన చాకచక్యం, నైపుణ్యం ఉపయోగించబడిన నేరాలేవీ యింత

వరకూ జరగలేదు....చివరికి మిగిలిన ఒకే ఒక మార్గంలో ప్రయత్నించాను. డూప్లికేట్ నగలు తయారు చేసి రహస్యంగా విక్రయించడంలో నిర్మల్ చంద్ పేరు పొందాడు. రెండు మూడుసార్లు అతని పేరు బైటికి వచ్చింది. కానీ, సాలిడ్ గా అతనిమీద యే రిపోర్టూ లేదు. నకిలీనగ తయారు చేయించే వ్యక్తిలా నటిస్తూ మరి కొంత వాకబు చేశాను...."

"ప్రభంజనం నిర్మల్ చంద్ అడ్రస్ యేమిటి?" డిటెక్టివ్ టెంపో అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"టెంపోగారూ, నేను సేకరించిన సమాచారం ప్రకారం నిర్మల్ చంద్ జేబుదొంగ లాంటి వ్యక్తి. మనకి కావాల్సింది జేబుదొంగ కాదు; బ్యాంకుల్ని కొల్లగొట్టే ఘరానా వ్యక్తి...."

"ప్రభంజనం, దిగు. డిప్యూ. ఐ.జీ. గార్ని కలుసుకో. ఒక ఇన్ స్పెక్టర్ని తోడుగా తీసుకో. కార్లో రోడ్లన్నీ తిరుగు. నువ్వు చూసిన నెంబరు లేని కారు ఎక్కడేనా దర్శనమిస్తుందేమో చూడు. నెంబర్ లెస్ కార్, నెంబర్ వన్ బ్యూటీ—ఏదీ కనిపించినా అతుక్కుపో!"

"మీ రెక్కడికి కెళ్తారు....?" ప్రభంజనం ప్రశ్నించాడు.

"నువ్వు అడ్రస్ చెప్తే వొకసారి నిర్మల్ చంద్ ని చూసొస్తా!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"థర్టీన్, మరాఠీ లేన్. టూ టౌన్" ప్రభంజనం నవ్వుతూ అన్నాడు.

కారు స్టార్టయింది. ప్రభంజనం దిగాడు. కారు కదిలింది....

# 15

తలుపులు తోసుకొని కుంకుమ గదిలోకి దూరింది. టేబుల్ వెనక కుర్చీలో కూచున్న వ్యక్తి గభాల్న లేచి, ఎత్తుగా నిలబడ్డాడు. ఇన్‌స్పెక్టర్ యూనిఫామ్‌లో హుందాగా ఉన్నాడతను, పొట్టిగా కత్తిరించిన క్రాపు, వెడల్పుగా పెదవుల చివర్ల దాకా సాగిన మీసాలు. నవ్వుతూ చూశాడతను.

"రెడీ?" కుంకుమ ప్రశ్నించింది. వైట్ షర్టుని జీన్స్‌లోకి టక్ చేసిన కుంకుమని నవ్వుతూ రెప్పవేయకుండా చూశాడతను. మాట్లాడకుండా సన్నగా ఈల వేశాడు.

అతని వెనకున్న తలుపు తెరుచుకుంది. ఇద్దరు పోలీసులు అతనికి యిరువైపులా ప్రత్యక్షమయ్యారు. గడ్డపారలు మింగిన వాళ్ళలా నిలబడ్డవాళ్ళని కుంకుమ క్షణకాలం చూసింది.

"లెటస్ గో!" అన్నాడతను.

కుంకుమ అతని దగ్గరగా నడిచి, అతనివైపు చెయ్యి చాచింది. టేబుల్ సొరుగులోకి చేతిని పోనిచ్చి అతను రివాల్వర్‌ని తీసి ఆమెకి అందించాడు. రివాల్వర్‌ని ఒకసారి చెక్ చేసి హాండ్‌బ్యాగ్‌లో పడేసుకుందామె. రిస్టువాచీ చూసుకుని, అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూలబడింది.

"ఆరు నిమిషాలు గడిచాక బయల్దేరదాం!" అందామె ఆవులిస్తూ.

"వన్ వన్ టూ, మిస్ కుంకుమకి టీ పట్టుకురా!" ఆ వ్యక్తి కూచుంటూ ఉత్తరువిచ్చాడు.

# 16

వెడల్పాటి నేలమాళిగలో పాత కుర్చీమీద కూచుని, విశ్వకర్మారావు గజపతినీ, రాంజోగినీ సాలోచనగా చూస్తూ సిగరెట్ వెలిగించాడు.

"వండిన అన్నం తినకుండా కూచోవాలనడం అన్యాయం!" విశ్వకర్మారావు ఉన్నట్టుండి అన్నాడు.

గజపతీ, రాంజోగీ తలలు ఊగించారు. విశ్వకర్మారావు దేన్ని గురించి అంటున్నాడో వాళ్ళకి తెలుసు.

"నిన్న రాజులా బతికి, ఇవాళ రాజులా బతుకుతున్న బలరామ్‌కి రేపట్నుంచీ చక్రవర్తిలా బతికే ఛాన్సుంది. బికారుల్లా బతుకుతున్న మనకి ఆ ఛాన్సు లేదు. రంభలాంటి పెళ్ళాం ఉన్న నపుంసకుడిలా మనం బతకాలి! ఇది అన్యాయం....!" విశ్వకర్మారావు ఆవేశంతో అన్నాడు.

"ఔను, అది అర్థంలేని పని!" గజపతి తాళం వేశాడు.

విశ్వకర్మారావు అతన్ని ఎగతాళిగా చూశాడు. "అర్థం లేని పని గురించి నోరు మెదపకుండా గంగిరెద్దులా అక్కడ తలలు ఊపారేం?"

"విశ్వకర్మారావ్, అతనికి ఎదురుచెప్పే శక్తీ, తెలివీ మాకు లేవని నీకు తెలుసు!" గజపతి అయిష్టంగా అన్నాడు.

"తల వూపకుండా నీలాగే మాట్లాడి వుంటే మాకూ వాయిదాల పద్ధతి అనేవాడేగా? అయినా బలరామ్ సలహాలో ఎంతో నిజం ఉంది...." రాంజోగి మెల్లిగా అన్నాడు.

"కష్టార్జితాన్ని ఖర్చు పెట్టకుండా, కక్కుబతుకు

బతకమనడం అన్యాయం!" విశ్వకర్మారావు ఉక్రోషంతో అన్నాడు. "డబ్బున్న వ్యక్తిగా నటించడం బాగానే ఉంటుందిగానీ, ఉండీ, లేనట్టు బతకడం అసహ్యంగా ఉంటుంది!"

"ఆయన చెప్పినట్టే అంటూ మనది మనం తీసుకొని, మన జాగర్తలో మనం హాయిగా ఉంటే సరిపోతుంది!" గజపతి తెలివిగా అన్నాడు.

"మీ ఇద్దరికీ తెలీదు: ఇందులో ఇంకొక అన్యాయం కూడా ఉంది. సగం అతను తీసేసుకొని, తతిమ్మా సగంలో ఆ కుంకుమకి వాటా పంచి, తతిమ్మా రొట్టె ముక్కని మూడు ముక్కలు చేసి మన మొహాన గిరాటేస్తాడు!...." విశ్వకర్మారావు కంఠంలో అసూయ ధ్వనించింది.

ఇద్దరూ బరువుగా నిట్టూర్చారు.

"కిరీటాన్ని తయారు చేయడంలో వొళ్ళూ, తలా గుల్ల చేసుకోవచ్చింది మనం! ప్లాన్ చేయడం సులభమే. అసలుకి సరితూగే నకలు తయారుచేయడం తేలికపని కాదు. మనం ఎలా శ్రమించామో మీకు తెలుసు. మనకీ సమానంగా రావాలి. ఆ వగలాడి, కుంకుమ ఏం సాధించింది? అతని వొళ్ళో కూచోవడం తప్పా?" విశ్వకర్మారావు కసిగా అన్నాడు.

"శ్రమకి తగిన ఫలితం దక్కాలంటే, నేనో సలహా ఇస్తా!" విశ్వకర్మారావు సిగరెట్ పీకని కిందపడేసి దాన్ని చూస్తూ అన్నాడు.

రెండు తలలు అతన్ని ఆత్రంగా, ఆశగా చూశాయి.

"డబ్బు తీసుకొని అతనిక్కడికొస్తాడు. ఆ తరవాత ఇక్కణ్నుంచీ మనం ముగ్గురమే బైటికి వెళ్తాం...."

విశ్వకర్మారావు ఆగి నవ్వుతూ చూశాడు.

గజపతి, రాంబోగి అయోమయంగా చూశారు. విశ్వకర్మారావు కుర్చీలోంచి లేచి వాళ్ళ దగ్గరగా జరిగాడు. నవ్వుతూ వాళ్ళ మొహాల్లోకి తీక్షణంగా చూశాడు. అతని కళ్ళు నకిలీ కిరీటంలోని నకిలీ వజ్రాల్లా మెరుస్తున్నాయి.

"ఇకముందు మొత్తం సొమ్మునీ ముగ్గురం సమానంగా, ధర్మంగా పంచుకుంటాం" విశ్వకర్మారావు కంఠం ఊరిస్తూ అంది.

"విశ్వకర్మారావ్ ....బ ల రా మ్ ...." గజపతి తడబడుతూ అన్నాడు.

"బలరామ్—సగం వాటా కొట్టేసి మిగిలిందాంట్లో కుంకుమ వాటానీ, ఆమెనీ సొంతం చేసుకోనే ఆలోచనలో వున్న బలరామ్—ఈ భూగృహంలో శాశ్వతంగా నిద్రపోతాడు!" విశ్వకర్మారావు సన్నటి కంఠంతో అన్నాడు.

"గుడ్ గాడ్!" రాంబోగి అరిచాడు. అతని మొహం మీద చెమట బిందువులు ప్రత్యక్షమవుతున్నాయి. గజపతి కళ్ళు తడిగా చూస్తున్నాయి.

"మైడియర్ ఫ్రెండ్స్, అతని మూలంగా మనకి అపాయం తప్పదు. ఒకరూపాయి మనం యెక్కువ ఖర్చు చేస్తే అతను మనల్ని బెదిరిస్తాడు. ఎంత పనైనా చేస్తాడు. పనయ్యాకకూడా అతని పెత్తనాన్ని నేను సహించను. మనలాంటివాళ్ళు బలరామ్‌లాంటి వాళ్ళకి ఎప్పటికైనా బలిపశువులుకాక తప్పదు! భవిష్యత్తుని తెలివి అనే అద్దంలో చూసి చెప్తున్నా. నా ప్లాను గురించి ఆలోచించండి; త్వరగా. అట్టే టైమ్ లేదు. మీరు సరే అంటే

అతను ఇవ్వబోయేదానికన్నా రెండింతలు అధికంగా మన ధనం అవుతుంది! లక్షలాది రూపాయల గోడలతో నిర్మించబడే మీ భవిష్యత్తు అనే బంగారు మేడని ఒకసారి మీ మనో నేత్రంతో చూడండి!" విశ్వకర్మారావు నవ్వుతూ బెడిలోహంమీద మరో రెండు సుత్తిదెబ్బలు వేశాడు.

గజపతి, రాంజోగీ ఒకర్నొకరు కాసేపు పరిశీలనగా చూసుకుంటూ వుండిపోయారు. ఇద్దరి మొహాల్లో యేదో ఆశ, యేదో భయం రెండురకాల రంగుల్లా ప్రత్యక్షమవుతున్నాయి.

"ఈ అడ్వెంచర్ కారణంగా దాదాపు నెలరోజులుగా మనం ఎక్కడికంటూ పడలేదు. వాటాలు పంచుకొని మరో రాష్ట్రానికి జారుకుందాం. మనం ఇప్పుడే మాయమైనట్టు ఎవ్వరూ అనుకోరు!" విశ్వకర్మారావు నవ్వుతూ అన్నాడు.

"విశ్వకర్మారావ్....బలరామ్‌ని....బలరామ్‌ని.. ఎలా తుదముట్టిస్తావ్?" గజపతి మెల్లిగా ప్రశ్నించాడు. రాంజోగి తన చూపుల్తో ఆ ప్రశ్నని అండర్ లైన్ చేస్తున్నాడు.

వాళ్ళిద్దరి నిర్ణయాన్ని తనకి తెలియజేస్తున్న గజపతి ప్రశ్న విశ్వకర్మారావుకి గిలిగింతలు పెట్టింది. అతను తళతళమంటున్న కళ్ళని వాళ్ళవైపు తిప్పాడు.

"అవలీలగా వజ్రాల్ని కొనిపారేసే నాకు అదో లెక్క కాదు!" అన్నాడు సగర్వంగా. "మనకి వాటాలు పంచడంలో మునిగిపోయిన అతన్ని క్షణంలో పైకి పంపేస్తాను. అది నాకొదిలేయండి. ఈ గదిలోంచీ, మరో గదిలోకి దారివుంది. మిమ్మల్ని అక్కడ వదుల్తాను.

శవపం, పారా ఉపయోగించి గొయ్యితవ్వండి!" అంటూ విశ్వకర్మ్యశావు గోడవారగా కదిలాడు. ఇద్దరూ అతన్ని నీడల్లా అనుసరించారు.

## 17

"వస్తున్నాడు. ఎవరూ అతన్ని వేటాడ్డంలేదు" గది లోకి ప్రవేశించిన మంగూ అన్నాడు. గుప్తా ముఖం నవ్వుతో యెలాస్టిక్ మొహంలా సాగింది. ఆదరా బాదరా అతను మంచంమీంచి దిగాడు.

"స్ట్రాంగ్ రూమ్‌లో వుంటాను. అతన్ని మెట్లమ్మట తీసుకురా. లిఫ్ట్ ఉపయోగించొద్దు!" గుప్తా ఉత్తరు విచ్చాడు. మంగూ మడమలమీద మెల్లిగా వెనక్కి తిరిగాడు.

"మంగూ...."

మంగూ తలతిప్పి గుప్తా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"అతన్ని నా దగ్గర వదిలి ఇద్దరికీ అరంజిలాన్ పట్రా. తెలుసుగా?"

జవాబుగా మంగూ పళ్ళికిలించాడు. అవసరం అయితే గానీ మంగూ తన శరీరంలో యే అవయవాన్నీ ఉపయోగించడు. అత్యవసరం అయితేగానీ అతను తన నోటిని ఉపయోగించడు. కళ్ళూ, పళ్ళూ చెప్పలేనప్పుడే నోటిని ఉపయోగించాలని అతని నమ్మకం. అతని నమ్మకం గుప్తాకి ఎంతో నచ్చింది.

మంగూ వెళ్ళిపోయాక గుప్తా చూడీదార్ పైజామా మీద పొడుగాటి జుబ్బా ధరించాడు. చకచకా స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

మూసిన తలుపువైపే చూస్తూ గుప్తా సిగరెట్ వెలి

గించాడు. తలుపు మెల్లిగా తెరుచుకుంది. పొడుగ్గా, హుందాగా అవుపిస్తున్న బలరామ్ ఆకారం గుమ్మంలో ఫ్రేంమధ్య పెయింటింగ్‌లా ప్రత్యక్షమైంది. అతని పెద వులమీద చిరునవ్వు విజయగర్వంతో నాట్యం చేస్తోంది.

"వెల్‌కమ్!" గుప్తా ఉత్సాహంగా అరిచాడు.

బలారామ్ ఠీవిగా లోపలికి అడుగులు వేశాడు. అతని చేతిలోని నల్లటి బ్యాగ్ మీద గుప్తా చూపులు కేంద్రీక రించబడ్డాయి.

"పాలసముద్రాన్ని ఒంటరిగా చిలికి అమృతభాండం సంపాయించావ్. కంగ్రాట్స్!" గుప్తా నవ్వుతూ అన్నాడు.

"ఇది అమృతభాండంకాదు; ఆదిలక్ష్మి!" బలరామ్ నవ్వుతూ సోఫా దగ్గరగా అడుగులువేసి కూచున్నాడు. అతను ఒళ్ళో జాగ్రత్తగా పెట్టుకున్న సంచీని గుప్తా ఆకలిగా చూశాడు.

"బలరామ్, సరుకుని చూద్దాం...."

"మిస్టర్ గుప్తా. యూ నో బెటర్ దేన్ దట్! యూ నో ది రూల్స్!" బలరామ్ నవ్వుతూ అన్నాడు.

గుప్తా కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "మిస్టర్ గుప్తా, నకిలీది తెచ్చి కొన్ని కోట్లకి మీకు అమ్మే ప్రయత్నం చేసేంత మూర్ఖత్వం నాలో లేదు! అసలు దాని స్థానంలో నకిలీది వుందని అక్కడ యెవరూ కనిపెట్టలేదనీ మీకు తెలుసు!" బలరామ్ నవ్వుతూ అన్నాడు.

"అఫ్‌కోర్స్...." అంటూ గుప్తా గుమ్మంలో నిలబడ్డ మంగూవైపు అదోలా చూశాడు. "నోరెండిపోతోంది. చల్లగా ఏదేనా పట్రా" అంటూ అతను బలరామ్ ఎదు రుగా మరో సోఫాలో కూచున్నాడు, అతని కళ్ళని

బలరామ్ వొళ్ళోని సంచీ అయస్కాంతంలా లాగుతోంది.

అరెంజ్ జూస్‌తో నిండిన రెండు పొడుగాటి గ్లాసు లున్న ట్రేని వాళ్ళ మధ్య వున్న టీపాయ్‌మీద పెట్టాడు మంగూ.

"మిస్టర్ గుప్తా, రొక్కం రెడీగా వుందా?" బలరామ్ ప్రశ్నించాడు.

"ఆఫ్‌కోర్స్.... రెండు పెద్ద సూట్ కేసుల్లో సర్దాను" అంటూ గుప్తా మంగూవైపు అర్థవంతంగా చూశాడు. మంగూ గోడవారగా జరిగి, వాల్ పేపర్లోని ఒక పేటర్న్‌మీద వేళ్ళతో తడిమాడు. గోడలా ఏర్పడ్డ అలమారలోంచీ రెండు పెద్ద సూట్ కేసుల్ని తీసి మంచంమీదికి చేరవేశాడు. వాట్ని తెరిచి, కొద్దిగా ముందుకి వాల్చాడు. నీట్ గా పేర్చబడిన నోట్లకట్టల్ని బలరామ్ తృప్తికరంగా చూశాడు.

అతని కళ్ళు తడగళ్ళలా గుప్తావైపు చూశాయి. "మిస్టర్ గుప్తా, లెక్కపెట్టే వ్యవధీ నాకులేదు. నమ్మకంతో తీసికెళ్తాను. ఒక్క నోటు తక్కువైనా, అది మీ ఉద్దేశపూర్వకంగా జరిగిందని నేను అనుకుంటాను. ఆ తరువాత మిమ్మల్ని కల్సుకుంటాను. ఈ కలయికలో స్నేహభావం ఉండదు!"

గుప్తా కళ్ళు పెద్దవిచేసి చూశాడు. "అంత మొత్తంలో ఒకటో, రెండో తగ్గించడంవల్ల వొరిగేదేమీలేదు. నాతో బేరంచేసే వ్యక్తిని నేను దగా చేయను!"

"అది మీకే ఆరోగ్యకరం!" అంటూ బలరామ్ సంచీలోంచి కిరీటాన్ని తీసి సోఫాలో తన పక్కనే పెట్టుకున్నాడు. ధగేల్ మంటున్న కిరీటాన్ని గుప్తా నోరు తెరిచి చూస్తూ వుండిపోయాడు. అతని కళ్ళు గోలీల్లా

పైకి పొడుచుకొని వున్నాయి. మెల్లిగా లేచి, కిరీటం దగ్గరగా సోఫామీద కూచున్నాడు. వణుకుతున్న చేతో కిరీటాన్ని తడిమాడు. వణుకుతున్న చేత్తో జేబులోంచి లెన్స్ తీసి కంటికి తగిలించాడు. కాసేపు వజ్రాల్ని పరీక్షగా చూశాడు. అతని మొహంమీద జిడ్డులా ప్రత్యక్షమవుతున్న చెమటని బలరామ్ చిరునవ్వుతో చూశాడు.

"మంగూ" .... గుప్తా కంఠం జీరగా ధ్వనించింది. మంగూ చక్రాలమీద కదులుతున్నట్టు అతని దగ్గరగా జరిగాడు. గుప్తా మౌనంగా అతనికి లెన్స్ అందించాడు. మంగూ లెన్స్‌ని తన పాము కంటికి అతికించి, నిమిషం పాటు కిరీటాన్ని పరీక్షిస్తూ వుండిపోయాడు. లెన్స్ తీసి గుప్తాకి అందించాడు. అతనివైపు పళ్ళికిలించాడు.

"బలరామ్, క్రౌన్ ఈజ్ వో కే!" గుప్తా వుద్రేకంతో అన్నాడు. రెండు చేతుల్లో కిరీటాన్ని ఆశగా పట్టుకున్నాడు. గుప్తా మొహంలోని ఆశనూ, ఆత్రాన్నీ, ఆనందాన్నీ బలరామ్ నిర్లక్ష్యంగా గమనించాడు. మొదటిసారిగా ధనరాశిని చూస్తున్న నిరుపేదలా అవుపిస్తున్నాడు గుప్తా.

"మిస్టర్ గుప్తా, మీ తల పెద్దది. కిరీటం పట్టదు. వదిలేయండి!" అన్నాడు నవ్వుతూ.

గుప్తా తన ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ కిరీటాన్ని పెట్టేసి లేచి, ముందు కూచున్నచోట కూచున్నాడు.

"బలరామ్, గొంతు యెండిపోతోంది. లెటస్ డ్రింక్ ఆరంజ్ జ్యూస్!" అంటూ ముందుకు వంగి బలరామ్ పైవున్న లోటాన్ని అందుకున్నాడు.

"నా గొంతుక తడిగానే వుంది!" బలరామ్

నవ్వాడు.

గుప్తా అతన్ని నవ్వుతూ చూశాడు. అతని నవ్వు కళ్ళలోకి పాకలేదని బలరామ్ కళ్ళు గ్రహించాయి.

"కమాన్! లెట్స్ సెలిబ్రేట్!" గుప్తా వాణిజ్య కం ఠంతో ప్రోత్సహించాడు.

బలరామ్ ట్రేలో గుప్తా చెప్పిన లోటానీ, గుప్తా చేతిలోని లోటానీ తదేకంగా చూశాడు. "మిస్టర్ గుప్తా, పెద్ద మొత్తం డబ్బు చేతులు మారేటప్పుడు ఎదుటివ్యక్తి ఇచ్చే ఆతిథ్యాన్ని స్వీకరించడం ప్రమాదం!"

గుప్తా అర్థంకానట్టు చూశాడు. అతని కళ్ళల్లో వచ్చిన మార్పుని బలరామ్ తృప్తికరంగా గమనించాడు. "నీ అర్థం?"

"డబ్బే ప్రాణంగా జీవిస్తున్న మీకు నా అర్థం అర్థమై వుండాలి! వోకే.. లెట్స్ నాట్ వేస్ట్ టైమ్.."

"యూ ఆర్ ఫూలిష్! బలరామ్, అనవసరంగా నన్ను అనుమానించి, అవమానిస్తున్నావ్! అయామ్ సారీ...."

దగ్గరగా కదులుతున్న బలరామ్‌ని చూస్తూ గుప్తా ఆపేశాడు.

బలరామ్ వేళ్ళు ఉక్కుటాలున గుప్తా చేతిలోని లోటాని చుట్టేశాయి. ఒడుపుగా అతని పట్టులోంచీ లోటాను విడిపించుకున్నాడు బలరామ్. ఎడంచేతో ట్రేలో వున్న లోటాని అందుకున్నాడు గుప్తా చేతిలోంచీ లాక్కున్న లోటాలోని జ్యూస్‌ని కొద్దిగా ట్రేలో పోసేశాడు. ట్రేనుంచీ అందుకున్న లోటాలోని జ్యూస్‌ని ఖాళీగా వున్న లోటాలోకి వొంపాడు. వేడి ద్రవాన్ని చల్లా రిస్తున్నట్టు నాలుగుసార్లు రెండు లోటాల్లోని జ్యూస్‌ని బాగా కలుపుతూ తిరగబోశాడు.

అయోమయంగా చూస్తున్న గుప్తా కళ్ళల్లోకి ఎగ

తాళిగా నవ్వుతూ చూశాడు. ఒక లోటాని అతనివైపు చాచాడు.

“గుప్తా. దీన్ని మొదట తాగు. తరువాత నేను తాగుతాను!” అన్నాడు బలరామ్ నవ్వుతూ.

గుప్తా చేతులు రెండూ క్రిందికి వేళ్లాడుతున్నాయి. అతను ఆందోళనతో చూశాడు” “నువ్వు....నువ్వు.... నన్ను....అవమానిస్తున్నావు....”

బలరామ్ సగర్వంగా నవ్వాడు. “నీ ఆతిథ్యం స్వీకరించి, స్పృహకోల్పోయో, ప్రాణాలుకోల్పోయో ఇక్కడ కూలిపోడం నాకు ఇష్టంలేదు!”

గుప్తా మొహంలోని రక్తం పూర్తిగా ఇంకిపోయింది. ఉబ్బినట్టున్న అతని పెదవులు అదురుతున్నాయి.

“కమాన్! డ్రింక్!” బలరామ్ ఛాలెంజ్ చేస్తూ అరిచాడు. “తాగు! తాగి, ఇందులో విషం కలపలేదని నిరూపించు!”

గుప్తా కళ్ళు కంగారుపట్టిన భూతద్దాల్లా వున్నాయి. బలరామ్ అతన్ని నవ్వుతూ చూశాడు. “గుప్తా, ఆశ మనిషిని అభివృద్ధి చేస్తుంది. దురాశ దుఃఖంలో పూడ్చేస్తుంది! నీలాగా కోటీశ్వరుణ్ని కాకపోయినా, నేనెంతో నేర్చుకున్నాను! నువ్వింకా ఎదగాలి. నిర్ణయించుకున్న టైమ్‌లోగా డబ్బుతో నేను తిరిగివెళ్ళకపోతే, నా శిష్యులు పోలీసులకి ఫోన్ చేస్తారు. స్వామీజీ కిరీటం పోయిందనీ, నీ దగ్గర వుందనీ ఇన్‌ఫామ్ చేస్తారు!”

బలరామ్ నవ్వుతూ ఆపాడు. గుప్తా వణికిపోతూ చూశాడు. అతని కళ్ళు బోనులో ఇరుక్కున్న ఎలక కళ్ళలా అటూ, ఇటూ చూస్తున్నాయి.

"గుప్తా, నేను కిరీటాన్ని తీసుకుంటాను. రెండు సూట్‌కేసుల్నీ రైల్వే పోర్టర్‌లా నువ్వు మోసుకురా. నా కార్లో పెట్టు. కారు స్టార్టు చేసి గేటు దాటేముందు సంచీని తోటలోకి గిరాటేస్తాను. ఇక్కణ్ణుంచీ వెళ్ళే ముందు నీ మంగూని ఈ గదిలో పెట్టి తాళం వేస్తావ్, నువ్వు!"

"నో! ఆ డబ్బు పట్టుకుపో! కిరీటాన్ని ఇక్కడే వదిలేయ్. నేను ఈ గడప దాటాను!" గుప్తా కంఠంలో కంగారు పలికింది.

బలరామ్ సగర్వంగా నవ్వాడు. "నీలాగా నేను పార్ట్‌నర్ని మోసం చేయను. కిరీటాన్ని నేను జీర్ణంచేసుకోను. నాకు డబ్బు చాలు. కమాన్! కదులు!" అంటూ బలరామ్ కిందికివంగి లోటాల్ని ట్రేమీద పెట్టబోయాడు. అతని మెడకి చల్లగా యేదో తగిలింది.

"లోటాల్ని కింద పెట్టొద్దు. గదంతా రక్తం చిందితే శుభ్రంచేసే ఓపిక నాకు లేదు! రెండు లోటల్లోని బ్యాన్‌నీ తాగేయ్!" వెనకనుంచీ సన్నటి కంఠం హెచ్చరించింది.

బలరామ్ విగ్రహంలా క్షణకాలం నిలబడిపోయాడు. తలపైకెత్తి చూశాడు. గుప్తా మొహంమీద ఆనందం, గర్వం భరతనాట్యం చేస్తున్నాయి. రివాల్వర్ కొస అతని చెవికిందికి పాకి బలంగా నొక్కింది. బలరామ్ ఓరగా చూశాడు. రివాల్వర్ని ఎడంచేత్తో పట్టుకున్న మంగూ గొగ్గిరిపళ్ళు అతన్ని వెక్కిరిస్తున్నట్టు అవుపిస్తున్నాయి. మంగూ పాము కళ్ళల్లో మృత్యువు నవ్వుతోంది.

"గొంతెండిపోతోంది. తాగు బలరామ్!" మంగూ

ఎగతాళిగా అన్నాడు. పకపకా నవ్వుతూ గుప్తా కిరీటం దగ్గరగా కదిలాడు. కిరీటాన్ని హెల్మెట్‌లాగా చేతి మధ్య ఇరికించి, బలరామ్ ఎదురుగా నడిచాడు. వెక్కిరింపుగా నవ్వుతూ చూశాడు.

"బలరామ్, నువ్వు ఇక్కణ్నుంచీ తిరిగి వెళ్ళవు. నీ శిష్యులు ఎవ్వరికీ యేమీ చెప్పలేరు. బహుశ ఈపాటికి వాళ్ళ నోళ్లు నొక్కేసి వుంటుంది!" గుప్తా నవ్వుతూ అన్నాడు.

## 18

లోపలికి వస్తున్న డిటెక్టివ్ టెంపోనీ, ప్రభంజనంనీ చూస్తూ ఐజీ ఆదరాబాదరా కుర్చీలోంచీ లేచాడు.

"ఏనీ డెవలప్‌మెంట్?" ప్రశ్నించాడతను.

"ఒక వ్యక్తిని ప్రశ్నించాలి. ఆరుగురు పోలీసులూ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ నాతో రావాలి. అవసరమైతే ఆ వ్యక్తిని కస్టడీలోకి తీసుకోవాలి...." టెంపో అన్నాడు.

"ఎవరతను?" ఐజీ అడిగాడు.

"నగరంలో నకిలీ నగలు తయారుచేయించి సప్లై చేయడంలో నిర్మల్‌చంద్ పేరుపొందాడు. భార్యల్ని ఏమార్చి, వాళ్ళ అసలు నగల్ని నకిలీ నగలతో రిప్లేస్ చేసి, జూదంలోనో, గుర్రాలమీదో తగలేసే భర్తలకి నిర్మల్‌చంద్ వ్యాపారం వరప్రసాదం! నిర్మల్‌చంద్‌ని కల్సుకున్నాను...." టెంపో ఆగి, సిగరెట్ వెలిగించాడు.

"నిర్మల్‌చంద్ నకిలీ కిరీటం తయారుచేశాడా?" ఐజీ కంఠంలో ఆత్రం ధ్వనించింది. టెంపో చిన్నగా నవ్వాడు.

"అతను యజమాని, సుత్రీ, పట్టకారూ పట్టుకోడు, మెల్లిగా అతన్ని దువ్వాను. గతంలో ఒకతను అతని దగ్గర పనిచేశాడు. అతని చేతిలో తయారైన నకిలీనగ నుంచీ, అసలు నగను వేరుచేసి పోల్చుకోడం దాదాపు అసాధ్యం అన్నాడు నిర్మల్‌చంద్ ...."

"ఎవరతను?" ఐజీ అడుగుతిగిలాడు.

అతనిప్పుడు నిర్మల్‌చంద్ దగ్గర లేడు. రెండేళ్ళక్రితం అతన్ని నిర్మల్‌చంద్ ఉద్యోగంలోంచీ పీకేశాడు. అతను ఉలిలాంటి వేళ్ళూ, కత్తిలాంటి బుర్రా వుండే వ్యక్తి. గుంటనక్క. చాలా పెద్దమనిషిగా చెలామణీ అయ్యే ఒక 'భర్త'కి నిర్మల్‌చంద్ ఆజ్ఞప్రకారం అతను నకిలీ నగలసెట్ తయారుచేశాడు. ఆ భర్త నకిలీ నగల్ని బ్యాంక్‌లాకర్లో పడేసి, అసలు నగల్ని ప్రియురాలికి ఇచ్చేశాడు. కొన్ని వారాల తరువాత నిర్మల్‌చంద్ శిష్యుడు ఆ భర్తగార్ని కల్సుకున్నాడు.

"నకిలీనగలు చేయించిన ఉద్దేశం అతని భార్యకి చెప్పే ఆలోచన తనకి వున్నట్టు చెప్పాడు. భర్త గడ గడలాడిపోయాడు. అసలు విషయాన్ని రహస్యంగా ఉంచాలంటే తనకి ఫీజు యిచ్చుకోవాలన్నా డతను! ఈ బ్లాక్ మెయిల్ గురించి తరువా తరువాత నిర్మల్‌చంద్‌కి తెలిసింది శిష్యుణ్ని తన్నితగిలేశాడు...."

"మిస్టర్ టెంపో, అత నెవరు? ఎక్కడున్నాడు?" ఐ.జీ. ఉద్రేకంతో అరిచాడు.

"అతనికి మూడు పేర్లున్నాయి. ఒకే యిల్లు—ఒకే చిరునామా! ఉంది!" టెంపో నవ్వుతూ అన్నాడు.

ఐ.జీ. అర్థం కానట్టు చూశాడు. టెంపో నవ్వాడు.

"అతని ఇంటిని వెంటనే ప్రశ్నించాలి. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌ని రమ్మనండి...."

ఐ జీ. మౌనంగా ఇంటర్‌కమ్ స్విచ్ నొక్కాడు.

•　•　•

డిటెక్టివ్ టెంపో కారుని రోడ్డువారగా, చీకటిగా వున్న చోట ఆపాడు. పక్కనే కూచున్న పృథ్వీరావ్‌ని చూశాడు.

"పృథ్వీరావ్, మనిద్దరం వెళ్దాం. నీ శిష్యులు చీకట్లో నిలబడతారు. నువ్వు సిగ్నల్ యిస్తే రంగంలోకి దూకుతారు...." అంటూ టెంపో కిందికి దిగాడు.

పృథ్వీరావ్ అతన్ని అనుసరించాడు....

రోడ్డుకి కొంచెం కొంచెం దూరంలో, చిన్న ప్రహరీ గోడలోపలున్న పాత యింటి ముందు టెంపో ఆగాడు. చుట్టూ చీకటి. చెవులు రిక్కించి, టెంపో తలుపుని చేత్తో తడిమాడు. వేళాడుతున్న తాళంకప్ప అతని చేతికి తగిలింది. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ చేతిని జేబులోకి పోనివ్వాడు. టెంపో అతన్ని వారిస్తూ ఇంటి వెనుకవైపుకి నడిచాడు. కాస్సేపట్లో ఇద్దరూ పెంకుల వరండా కింద, పెరటి గుమ్మం ముందు నిలబడ్డారు.

టెంపో తలుపు తోశాడు. తలుపు కదల్లేదు. క్షణ కాలం చెవులు రిక్కించి విని, టెంపో జేబులోంచీ పెన్సిల్ టార్చ్ తీశాడు. బటన్ నొక్కి,తలుపు చెక్కల మధ్య వున్న సన్నటి సందుగుండా పరీక్షగా చూశాడు. లోపలి గొళ్ళెం నల్లగా అతనికి అవుపించింది. టార్చిని ఆర్పేసి టెంపో ఇన్‌స్పెక్టర్ వైపు తలవాల్చి, గుస గుసగా యేదో చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ మౌనంగా జేబులోంచీ చాకుని తీసి, టెంపోకి అందిం

చాడు. వేలితో గుర్తుంచుకొన్న తలుపు కన్నంలోంచీ చాకుని లోపలికి దూర్చి, టెంపో ముందుకి వంగాడు.

రివాల్వర్ ని చేత్తో పట్టుకొని ఇన్ స్పెక్టర్ అలర్ట్ గా నిలబడ్డాడు ...

• • •

వర్షంలో తడిసిపోయినవాళ్ళలా, చెమటతో తడిసి పోయిన గజపతీ, రాంబోగీ ఆగి, విశ్వకర్మారావువైపు అలసటగా చూశారు. వర్క్ ఇన్ స్పెక్టర్లా నిలబడ్డ విశ్వకర్మారావు చెమటతో తడిసి, మెరుస్తున్న వాళ్ళ మొహాల్లోకి చూశాడు.

"మరో అరడుగు తవ్వితే చాలు. తల్లిగర్భంలో పాపలా అతను ఈ గోతిలో ఇరుక్కుపోతాడు!"

చూపుడు వేలితో నుదురుమీంచీ కారుతున్న చెమటని తుడుస్తూ గజపతి నిట్టూర్చాడు.

"విశ్వకర్మారావ్, అంతా అనుకొన్నట్టే జరుగుతుందంటావా? ఇంతకీ అతను ఇక్కడికి వస్తాడా?"

"వచ్చినట్టు! రాకపోతే మన ఆరుచేతులూ అతని మెడకి ఉరితాడు తగిలిస్తాయని అతనికి తెలుసు. అదీ గాక, తను యెవరితో బేరం చేస్తున్నాడో మనకి తెలీకుండా అతను సీక్రెట్ గా వుంచాడు. అయితే ఈ విశ్వకర్మారావు నుండీ యెవడూ యేమీ దాచలేడు! కిరీటాన్ని యెవరికి యివ్వడానికి ప్లాన్ చేశాడో నే నెప్పుడో కనిపెట్టాను. చక్రవడ్డీకి డబ్బు తిప్పుతున్న గుప్తాకి అతను ఫోన్ చేయడం ఒకసారి నేను గమనించాను. మనకి టోపీ వేస్తే, అతనితో బాటు గుప్తా కూడా మునిగిపోతాడు!" విశ్వకర్మారావు నవ్వుతూ అన్నాడు.

"కమాన్, అరడుగు తవ్వేసి, కాసేపు విశ్రాంతి తీసుకుందాం!" అంటూ రాంబాగి గునపంతో తవ్వడం ప్రారంభించాడు....

* * *

తలుపు తోసుకొని డిటెక్టివ్ టెంపో చీకటిగా ఉన్న హాల్లోకి జరిగాడు. ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అతన్ని అనుసరించాడు. టెంపో తలుపు మూసి గొళ్ళెం పెట్టేశాడు. ఊపిరి బిగబట్టి, స్తంభంలా ఇద్దరూ కాసేపు నిలబడ్డారు. హాలు రూపం లీలగా వాళ్ళకి ప్రత్యక్షమవుతోంది.

నిశ్శబ్దం బరువుగా వాళ్ళ చెవుల్ని కప్పేస్తోంది. టెంపో మెల్లిగా కదిలాడు. ఎడంవైపున్న తలుపు ముందు ఆగాడు. అపరిశుభ్రంగా ఉన్న ఇల్లు యేదో వాసనని లీలగా ఎగజిమ్ముతోంది.

టెంపో చెవిని తలుపుకి ఆనించాడు. నిశ్శబ్దం. టెంపో చెయ్యి తలుపుమీద ఆనింది. తలుపు కొద్దిగా జరిగింది. చేతిమీదికి కొద్దిగా బరువుని కేంద్రీకరించాడు. సన్నగా చప్పుడు చేస్తూ తలుపు లోపలికి కదిలింది. క్షణంలో ఇద్దరూ లోపల దూరారు. తలుపుని మూసి, టెంపో చెవులు రిక్కించాడు. ఇన్స్పెక్టర్ రావ్ ఊపిరి పీలుస్తున్న చప్పుడు నిశ్శబ్దాన్ని భంగం చేస్తోంది. నాలుగు వైపులనుంచీ చీకటి వాళ్ళని చూస్తోంది. క్షణాలు గడుస్తున్నాయి. టెంపో చెయ్యి తటాలున ఇన్స్పెక్టర్ చేతిని తాకింది.

టెంపో మెల్లిగా ముందుకి కదిలాడు. గదిలో ఉక్కగా ఉంది. ఎదురుగా, నల్లటి తెరలోని తెల్లటి చుక్కలా యేదో టెంపో కళ్ళని ఆకర్షిస్తోంది. కాసేపట్లో

టెంపో ఆ చుక్క దగ్గరగా ఆగాడు. అతని అరచెయ్యి ఆ తెల్లటి చుక్కని కప్పింది. చేతిని దూరంగా తీశాడు టెంపో. నిర్మానుష్యంగా ఉన్న యింట్లోకి, చాలా కాలంగా ఎవ్వరూ కాపరంలేని యింట్లోకి తను ప్రవేశించాడన్న ఆలోచన టెంపోలోంచి ఎగిరిపోయింది. ఇంట్లో ఎవరో ఉన్నారు...

ఉద్రేకంతో టెంపో అరచేత్తో గోడలా వున్న ప్రదేశాన్ని తడిమాడు. లోహంలా యేదో అతని చేతికి చల్లగా తగులుతోంది. టెంపో తలని ఇన్‌స్పెక్టర్ వైపు వాల్చాడు.

"పృథ్వీ. లోపల యెవరో ఉన్నట్టుంది. రేకు తలుపు లోని చిల్లుల్లోంచీ తెల్లటి చిన్న చుక్కలా ఇవతలికి దూకుతోంది!" అన్నాడతను తగ్గు స్వరంతో.

ఇద్దరూ చెవులు రిక్కించారు. టెంపో ఉలిక్కి పడ్డాడు. చుట్టూ పేరుకున్న నిశ్శబ్దాన్ని ఏదో చప్పుడు, చిన్న చప్పుడు క్రమబద్ధంగా భగ్నం చేయడం ప్రారంభించింది. రాతిమీదో, గట్టి నేలమీదో పడుతూ లోహం చేసే చప్పుడు!

"పృథ్వీ, డూ యూ హియరిట్?" టెంపో ప్రశ్నించాడు.

"యస్!" ఇన్‌స్పెక్టర్ కంఠం బుసకొట్టింది.

"లోపల యెవరో ఉన్నారు. ఏదో చేస్తున్నారు!" టెంపో ఉద్రేకంతో అన్నాడు; రేకుతలుపుని చేత్తో తోస్తూ.

తలుపు కదల్లేదు. "ఏం చేద్దాం?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

టెంపో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తెరవడానికి ఏ విధంగా ప్రయత్నించినా తలుపు చప్పుడు చేస్తుంది. ఇంటికి ముందూ వెనకా రెండే తలుపులున్నాయి. లోపలున్న వ్యక్తులు—లేక వ్యక్తి—బైట పడాలంటే ఆ రెండు తలుపుల్నే ఉపయోగించాలి. వీధి తలుపు బైట తాళం వేయబడింది. తాము ఉపయోగించిన పెరటి తలుపు ఒక్కటే ఇవతలికి దారి....

"పృథ్వీ, నీ శిష్యుల్ని తీసుకురా! ఇద్దర్ని యింటిముందు రెండువేపులా గోడ చాటులో రెడీగా ఉండమను. ఇద్దర్ని పెరటి తలుపు ముందు నిలబడమను. ఇద్దరిని యిక్కడికి తీసుకురా" టెంపో తగ్గుస్వరంలో సూచించాడు.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ మౌనంగా కదిలాడు. లయబద్ధంగా లోపల్నుంచి తనవేపు లీలగా దూసుకొస్తున్న చప్పుడుని ఏకాగ్రతతో వింటూ టెంపో నిలబడిపోయాడు. నిమిషాలు గడుస్తున్నాయి. ఇన్‌స్పెక్టర్ పృథీరావ్ యిద్దరు పోలీసులూ కాస్సేపట్లో చప్పుడు కాకుండా అతన్ని చేరుకున్నారు.

"టెంపో, తలుపుని బలవంతంగా ఓపెన్ చేద్దామా?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

"దొంగతనంగా తెరవడానికి ప్రయత్నించినా, దొరతనంగా తట్టినా ఈ మెటల్ డోర్ చప్పుడు చేస్తుంది. తెలిసినవాళ్ళు తట్టినట్టు తలుపు తట్టుదాం!" టెంపో నవ్వుతూ అన్నాడు.

మరుక్షణం అతని చెయ్యి మెటల్ డోర్ని ధైర్యంగా తట్టింది.

# 19

బలరామ్ గుప్తానీ, మంగూనీ ఓరగా చూశాడు. నిర్భయంగా తన చేతుల వేళ్ళని వదులు చేశాడు. ర్యాక్‌తో వున్న రెండు గాజు లోటాలూ మొసాయిక్ మీద భళ్ళున శబ్దం చేస్తూ పగిలాయి. రివాల్వర్ కొన గుండ్రంగా అతన్ని చెవికింద పొడుచుకుపోతున్నట్టు నొక్కింది.

ఉక్రోషంతో మంగూ నిట్టూర్చడం అతనికి పాము బుసలా వినిపించింది.

"గుప్తా, నన్ను మోసం చేసి నువ్వు తప్పించుకోలేవు. కుంకుమ నీకోసం పని చేయడం ఎప్పుడో మానేసింది. నా దగ్గరకు చేరిన మూడోరోజునుంచీ ఆమె నా నీడగా మారిపోయింది. పైకి నీ సెక్రటరీలా నటించింది! తొందర పడి...."

"షటప్! ఇలాంటి బుకాయింపులు నేను చాలా విన్నాను! కుంకుమ అలా చేయదు. ఆమె గురించి నీకు తెలీదు...."

"చివరి క్షణంలో ఇలా పొరపాట్లు చేసి చాలామంది ఫెయిలయ్యారు. నామాట విను. నీకు కావాల్సింది నువ్వు తీసుకో; నాకు ఇవ్వాల్సింది నాకు ఇచ్చెయ్ ...." బలరామ్ ఓరగా చూస్తూ అన్నాడు.

"నాకు అవ్వా బువ్వా రెండూ కావాలి! కిరీటం, పీఠం రెండూ నాకే కావాలి. నీకు ఇవ్వాల్సింది మంగూ ఇస్తాడు!" అంటూ గుప్తా నవ్వుతూ మంగూ వైపు చూశాడు.

"మంగూ, వాణ్ణి తీసికెళ్ళు. గది ఖరాబు కావడం నాకు ఇష్టంలేదు. వాడి శరీరాన్ని ఏం చేయాలో నీకు తెలుసు!"

మంగూ తలపంకిస్తూ, బలరామ్ వైపు చూశాడు. అతని కళ్ళల్లో ఏదో మృగవాంఛ కత్తి కొనలా తళుక్కు మంటోంది.

"చేతులు పైకెత్తు. కదులు!" మంగూ కీచుగా అన్నాడు.

"గుప్తా..." బలరామ్ ఏదో చెప్పబోయాడు.

మంగూ కడిచెయ్యి అట్లకాడలా అతని నోటిమీద వాలింది. బలరామ్ పెదవులు చిట్లిపోయాయి. ఎర్రటి కళ్ళు ఆగ్రహాన్ని ఎగజిమ్మాయి. అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అతని చెవికింద వొత్తిడి ఎక్కువైంది. చిన్నగా చప్పుడైంది. రివాల్వర్ సేఫ్టీ కాచ్ రిలీజ్ చేయబడిందని అతను గ్రహించాడు. అప్రయత్నంగా అతని పిడికిళ్ళు వదులయ్యాయి.

"చేతులు పైకెత్తు!" మంగూ కంఠం అతని చెవిలో గింగురుమంది.

బలరామ్ చేతులు ఎత్తేశాడు.

"కదులు!"

బలరామ్ కదిలాడు. గుప్తా గున్న ఏనుగులా కదిలి, తలుపుని లోపలికి లాగిపట్టుకున్నాడు. బలరామ్ ముల్లుకర్రపోటు తింటున్న ఎద్దులా కదులుతున్నాడు. అతని మెదడులో శరవేగంగా ఆలోచనలు పాగుతున్నాయి. కుంకుమ మరో అరగంటదాకా తనకోసం యెదురుచూస్తుంది. ఆ తరవాతే ఆమె ఇటువేపు రావొచ్చు: అనుమానం కలిగితే!

రివాల్వర్ మెరుపులా కదిలి అతని వీపులో, ఎడంవైపున గుండె లెవల్లో గునపంలా గుచ్చుకుంది. మొరటుగా అతన్ని ముందుకు తోస్తున్నాడు మంగూ, సన్నగా

పొడుగ్గావున్న మంగూ బలరామ్‌ని భయపెట్టడంలేదు. అయితే అతని చేతిలోని రివాల్వర్ బలరామ్‌ని ఆందోళనతో నింపుతోంది. ఇందాకా మంగూ కళ్ళల్లో ప్రత్యక్షమైన యేదో రాక్షసవాంఛ, చంపాలన్న కోరిక అతన్ని గడగడలాడిస్తోంది.

“థాంక్స్ బలరామ్ గుడ్ బై!” తనని దాటి గుమ్మంలో దూరుతున్న బలరామ్‌ని ఎగతాళిగా చూస్తూ అన్నాడు గుప్తా. బలరామ్ ఆగే ప్రయత్నం చేశాడు. రివాల్వర్ అతన్ని కర్కశంగా ముందుకు నెట్టింది.

బలరామ్ గుమ్మం దాటాడు. మంగూ గుమ్మంలో వున్నాడు. ఇద్దరికీ మధ్య రివాల్వర్, దాన్ని పట్టుకున్న మంగూ చెయ్యీ వున్నాయి. గోడవైపునుంచీ యేదో చెయ్యి సమ్మెటలా, మంగూ ముంజేతిమీద దిగింది. అసంకల్పితంగా మంగూ కెవ్వుమన్నాడు. రివాల్వర్ అతని చేతిలోంచీ విసురుగా కిందపడింది. ఏం జరిగిందో అతను తెలుసుకునేలోగా మరో రివాల్వర్ అతని ఛాతీ మీద గుచ్చుకుంది. మంగూ విసురుగా గదిలోకి పడి పోయాడు.

బలరామ్ తటాలున వెనక్కి తిరిగాడు. రివాల్వర్ కొన అతని ఛాతీమీద ముద్దెట్టుకుంది. రివాల్వర్ని గురి పెట్టిన అపరిచిత వ్యక్తిని అతను ఆశ్చర్యంగా చూశాడు. పొట్టిగా కత్తిరించిన క్రాపు భారీ విగ్రహం. ఖాకీ యూనిఫాం.

“బలరామ్, నీ ఆట కట్టయింది! తిక్కచేష్టలేకుండా లోపలికి పద!” అన్నాడతను గంభీరంగా.

బలరామ్ ఉలిక్కిపడ్డాడు. గదిలోకి జొరబడిన ఇద్దరు కాన్‌స్టేబుల్స్ గుప్తానీ, మంగూనీ రివాల్వర్స్‌తో

కంట్రోల్ చేస్తున్నారు. బలరామ్‌కి ఏమీ అంతుపట్టడం లేదు. పోలీసులు ఇక్కడికెలా వచ్చారు?

భారీ వ్యక్తి, ఇన్‌స్పెక్టర్ బలరామ్‌ని లోపలికి నడిపించాడు. కాస్సేపట్లో బలరామ్, గుప్తా, మంగూ యాదవ్ ఖైదీల్లా గోడకి నిలబెట్టబడ్డారు. మూడు రివాల్వర్లు ముగ్గుర్నీ కంట్రోల్ చేస్తున్నాయి. గుప్తా మొహంలో ఆశ్చర్యం, ఆందోళనా ప్రస్ఫుటంగా అవుపిస్తున్నాయి. పల్చటి జుబ్బా చెమటతో అతని శరీరానికి అతుక్కుపోతోంది. కిరీటాన్ని బ్యాగ్‌కి అదిమిపట్టుకున్న అతని చేతులు వణుకుతున్నాయి. హఠాత్పరిణామం ముగ్గుర్నీ ఒకే రకమైన ఆశ్చర్యంలో ముంచేసింది.

ఇన్‌స్పెక్టర్ గుప్తా దగ్గరగా జరిగాడు. కిరీటాన్ని అందుకొని టీపాయ్‌మీద పెట్టాడు. కింద చెల్లాచెదురుగా పడున్న గాజుముక్కల్ని ఓసారి చూసి, కిరీటాన్ని చిరునవ్వుతో గమనించాడు. తలెత్తి గుప్తావైపు చూశాడు.

“సో, వజ్రకిరీటంకోసం బ్రహ్మాండంగా ప్లాన్ చేశారన్నమాట!” నవ్వుతూ అన్నాడతను.

గుప్తా కళ్ళు అటూ ఇటూ కదిలాయి. “ఇన్‌స్పెక్టర్ నాకేం తెలీదు. ఇతను, బలరాం—కిరీటాన్ని పట్టుకొచ్చి బేరం పెట్టాడు. దశావతారానంద స్వామికి వజ్రకిరీటం తయారుచేయబడ్డట్టు పేపర్లలో చదివాను. కిరీటాన్ని చూడగానే ఇతను దాన్ని కాజేశాడని గ్రహించాను. ఇతన్నీ, కిరీటాన్ని అధికార్లకి అప్పగించే ప్రయత్నంలో నేనూ, మంగూ వున్నాం. సమయానికి మీరొచ్చారు.

బలరాం గుప్తాని వోరగా చూశాడు గుప్తా సమయస్ఫూర్తి అతన్ని ఆశ్చర్యంతో నింపుతోంది. ఎగతాళిగా ధ్వనించిన నవ్వు అతని చూపుల్ని ఇన్‌స్పెక్టర్ వైపు

తిప్పింది.

"మిస్టర్ గుప్తా, పావు గంటనుంచీ నీ గది ముందు నేనున్నాను. లోపల—జరిగిన నాటకాన్ని చక్కగా విన్నాను. నీకు అవ్వాబువ్వా కూడా కావాలిగా!" ఇన్స్పెక్టర్ నవ్వుతూ అన్నాడు.

గుప్తా ఉలిక్కిపడ్డాడు. దీనంగా చూశాడు. "ఇన్స్పెక్టర్ గారూ, నేను ఏ నేరమూ చేయలేదు. కిరీటాన్ని తస్కరించలేదు. వాడెవడో దొంగిలించినదాన్ని నా వద్దకు తీసుకొస్తే అది నా తప్పు కాదు! ఇందాకా మీరు విన్నదంతా నిజంగానే నాటకం. అతన్ని ఏమార్చడానికి యేదేదో వాగాను. ఈలోగా మీరే వచ్చారు. నాకు శ్రమ తప్పింది. కిరీటాన్ని, దొంగనూ మీరే పట్టుకెళ్ళిపోండి!"

గుప్తా కళ్ళల్లో అవుపిస్తున్న నక్క తెలివిని ఇన్స్పెక్టర్ చిరునవ్వుతో చూశాడు. మెల్లిగా మంచం మీదున్న సూట్ కేసుల్ని సమీపించాడు. మూతలు తెరిచి లోపలున్న నోట్లకట్టల్ని ఒకసారి చూసి, చూపుల్ని గుప్తా వైపు తిప్పాడు.

గుప్తా ఒకసారి గుటకలు మింగాడు. "అది....అది.... వేరే పనికి సర్దిన పైకం...." అన్నాడతను వణికే కంఠాన్ని అదుపులో వుంచుకోడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ.

ఇన్స్పెక్టర్ చిన్నగా నవ్వాడు. ఇంతవరకూ తనని గుర్తించనట్టుగా ప్రవర్తిస్తున్న ఇన్స్పెక్టర్ని బలరామ్ ఆశ్చర్యంతో రెప్పవేయకుండా చూస్తున్నాడు. కిరీటం గల్లంతైన సంగతి అరగంట క్రితందాకా ఎవ్వరికీ తెలీదు. గుప్తా ఆ సంగతి తనకి రిపోర్టు చేయటానికి కొండమీద

ఎవర్నో వుంచాడని తనకి తెలుసు. మరి ఈ పోలీసులు ఎక్కణ్నుంచి ఊడిపడ్డారు?

విశ్వకర్మారావు, గజపతి రాంజోగి....కుంకుమ.... నలుగురి రూపాలూ అతని మనోయవనికమీద చకచకా ప్రత్యక్షమయ్యాయి. వాళ్ళెందుకు పోలీసులకి చెప్తారు? వడ్డించిన విస్తరిమీద ఎందుకు మట్టి చల్లుకుంటారు? ఎక్కడో, ఏదో పొరపాటుంది. చీటికీ మాటికీ ఇన్‌స్పెక్టర్ ఎందుకు క్రుకెడ్ గా నవ్వుతున్నాడు?

ఇన్ స్పెక్టర్ సన్నగా వేసిన ఈల బలరామ్ ఆలోచనల్ని తెంచేసింది. కదులుతున్న తలుపు అతని దృష్టిని ఆకర్షించింది. అతను ఆశ్చర్యంలో నోరు తెరిచాడు....

## 20

“స్టాప్!” విశ్వకర్మారావు చిన్నగా అరిచాడు. గజపతి చేతిలోని పారా, రాంజోగి చేతిలోని గడ్డపారా కదలడం మానేశాయి. ఇద్దరూ ప్రశ్నార్థకంగా అతన్ని చూశాడు. తలని వోరగా వాల్చి ఏకాగ్రతతో వింటున్న విశ్వకర్మారావు వాళ్ళవైపు చూపుల్ని తిప్పాడు. చిరునవ్వు అతని పెదాల్ని చీల్చింది.

“అతనే! ...ఆయుధాల్ని పక్కన పెట్టేయండి. మొహాలూ, చేతులూ తుడుచుకోండి! సమయం చూసి పని ముగిస్తాను. తరవాత ఏం చేయాలో మీకు తెలుసు.. కమాన్!” అంటూ చిన్నగదిలోంచీ చకచకా కదిలాడతను.

గజపతీ, రాంజోగి ఆదరాబాదరా అతన్ని అనుసరించారు. సన్నగా, పొడుగ్గా వున్న మెట్లెక్కి మూసిన రేకుతలుపుముందు ఆగాడు విశ్వకర్మారావు. తలుపుమీద మళ్ళీ చప్పుడయింది.

"బాస్...." విశ్వకర్మారావు మెల్లిగా అన్నాడు. అతను తప్ప మరెవరూ లోపలికి రాలేరు. వీధి తలుపు తాళం చెవి అతనికిచ్చాడు తను.

"కమాన్! ఎంత సేపు?" అటువైపునుండీ వినిపించింది.

ఎంతో సేపు లేదు! విశ్వకర్మారావు తనలో నవ్వుకుంటూ గొళ్ళెంలాగి, తలుపు తెరిచాడు. క్షణంలో అతని మొహంమీది చిరునవ్వు మాయమైంది. గుమ్మంలో సూటూ బూటూ ధరించి నిలబడిన అపరిచిత వ్యక్తిని ఆశ్చర్యంతో చూశాడతను.

"ఎవరు? ఎందుకొచ్చారు?" కోపంగా గద్దించాడు విశ్వకర్మారావు.

డిటెక్టివ్ టెంపో మాట్లాడకుండా చూశాడు. తన ముందు నిలబడ్డ పొడుగాటి, సన్నటి వ్యక్తి గడ్డంనున్నగా గీయబడింది. అతని వెనక నుంచున్న ఇద్దరూ ఇప్పుడిప్పుడే షేవ్ చేసుకున్నట్టు అవుపిస్తున్నారు. టెంపోలో ఆలోచనలు జెట్ స్పీడులో సాగుతున్నాయి. వీరబ్రహ్మం.... సుబ్బారావు....విశ్వకర్మారావు.....ప్రస్తుతం తనకి ఎవరు కావాలి?

"విశ్వకర్మారావుగారు...." క్షణంలో తను సెలెక్ట్ చేసుకున్న పేరుని టెంపో యాంత్రికంగా ఉచ్చరించాడు.

"నేనే. ఏం కావాలి? మీరెవరు? లోపలికి ఎలా వచ్చారు?"

"మీరొకసారి జ్ఞానపర్వతంమీదికి రావాలి. ఎమర్జెన్సీ! స్వామీజీ వజ్రకిరీటం గురించి మీరు వినేవుంటారు. కిరీటంలోని వజ్రాలు అసలువి కావు అని మా బాస్ అనుకుంటున్నారు. దాన్నొకసారి మీరు చూడ్డం మంచిదని మా బాస్...., ధీరజ్‌మల్ — అనుకున్నారు...."

టెంపో ఆగాడు.

జ్ఞానపర్వతం పేరూ వజ్రకిరీటం అన్న పదం విశ్వకర్మారావు ముఖంమీదా, కళ్ళల్లో ప్రతిఫలింప చేస్తున్న మార్పుల్ని టెంపో జాగ్రత్తగా గమనిస్తున్నాడు. విశ్వకర్మారావు కళ్ళు అనుమానంగా చూస్తున్నాయి. నివురు కింద నిప్పులా ఏదో భయం ఆ అనుమానంకింద దాగి వుంది.

"నేను.... నేనిప్పుడు రాను.... వేరే పని వుంది...." విశ్వకర్మారావు తడబడుతూ అన్నాడు.

"పెద్ద పెద్ద వాళ్ళంతా అక్కడున్నారు. మీరు ఎక్స్పర్టు అని అందరికీ తెలిసింది. మిమ్మల్ని అరెస్టుచేసి తీసుకు రమ్మని ఐజీగారు ప్రత్యేకంగా చెప్పారు. మీకు తగిన పారితోషికం ఇవ్వబడుతుంది...." టెంపో నవ్వుతూ అన్నాడు.

విశ్వకర్మారావు ముఖం యెందుకో తెల్లగా పాలిపోయింది. అతని వెనకనుంచున్న ఇద్దరి ముఖాల్లో ఏదో కంగారు ప్రత్యక్షమవుతోంది.

"సారీ.... రేపొస్తాను...." విశ్వకర్మారావు మెల్లిగా అన్నాడు. కిరీటం నకిలీదని ఇంత త్వరగా వాళ్ళెలా పోల్చుకున్నారు? కొంపతీసి బలరామ్ వచ్చేస్తాడా? బలరాం ఇప్పుడే రాకూడదని లోపల్లోపలే అతను ప్రార్థించాడు.

టెంపో నవ్వుతూ వెనక్కి జరిగాడు. కన్నార్పకుండా విశ్వకర్మారావుని చూశాడు.

"ఓకే; ఇన్స్పెక్టర్, విశ్వకర్మారావుని కస్టడీలోకి తీసుకో. అతను మర్యాదగా వచ్చేలా లేడు!" టెంపో గంభీరంగా అన్నాడు. విశ్వకర్మారావు అయోమయంగా

చూస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్! కస్టడీ!

సుష్మంలో ప్రత్యక్షమైన ఇన్‌స్పెక్టర్నీ, ఇద్దరు పోలీసుల్నీ అతను కంగారుగా చూశాడు. ఇన్‌స్పెక్టర్ చేతిలో రివాల్వర్ మెరుస్తోంది.

“ముగ్గురూ చేతులు తలమీద పెట్టుకోండి. మెల్లిగా పైకి రండి!” ఇన్‌స్పెక్టర్ కంఠం ఖంగుమంది.

టెంపో పక్కకి జరిగాడు. పెన్సిల్ టార్చి వెలిగించి గోడని పరీక్షగా చూస్తూ కదిలాడు. కాస్సేపట్లో అతను స్విచ్ నొక్కాడు. గదిలో నలభై వాట్ల బల్బు బలహీనంగా వెలిగింది.

గోడకి ఆన్చి నిలపెట్టబడిన ముగ్గుర్నీ ఇన్‌స్పెక్టర్ రివాల్వర్‌తో కంట్రోల్ చేస్తున్నాడు. కోటుజేబు లోంచీ రివాల్వర్ యివతలకి లాగి టెంపో మెట్లమ్మట కిందికి దిగపాగేడు.

రెండు నిమిషాల్లో టెంపో తిరిగొచ్చాడు. తెల్లగా పాలిపోయిన మొహాలతో గోడకి బల్లుల్లా అతుక్కుపోయిన ముగ్గుర్నీ ఒకసారి చూసి, ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగాడు.

“క్షేమంగా తవ్విన గొయ్యి తప్ప, కింద యెవ్వరూ లేరు; ఏమీ లేదు!” అన్నాడు నవ్వుతూ. మెల్లిగా విశ్వకర్మారావు వైపు చూశాడు.

“విశ్వకర్మారావ్, వజ్రకిరీటం యెక్కడ?” టెంపో కటూలున ప్రశ్నించాడు.

విశ్వకర్మారావు ఉలిక్కిపడ్డాడు. దిక్కుతోచనట్టు చూశాడు. ముగ్గురి మొహాల్లో, పూసిన రంగులా అవుపిస్తున్న ఒకే రకం భయాన్ని టెంపో తృప్తికరంగా చూశాడు.

“వ....జ్ర....కి....రీ....టం.... ఏ....మి....టి....?”

విశ్వకర్మారావు తడబడుతూ అడిగాడు.

"నీతోబాటు బ్యాంక్ వ్యాన్‌లో పాలశ్యాన్‌లో కిరీటాన్ని తీసుకొచ్చిన నీ గురువు యెక్కడ?" డిటెక్టివ్ టెంపో విశ్వకర్మారావు కళ్ళల్లోకి కత్తితో కోస్తున్నట్టు అడిగాడు.

విశ్వకర్మారావు మళ్ళీ ఉలిక్కిపడ్డాడు. ఊపిరి పీల్చుకోవడం మరచిపోయి. అయోమయంగా చూశాడు. అతని పెదవులు వణకడం ప్రారంభించాయి. ఇన్‌స్పెక్టర్ చేతిలోని రివాల్వర్ అతని డొక్కలో నిర్దాక్షిణ్యంగా గుచ్చుకుంది.

"మాట్లాడు!" హుంకరించాడు ఇన్‌స్పెక్టర్. విశ్వకర్మారావు వెర్రివాడిలా చూశాడు.

"విశ్వకర్మారావ్, ఎవరతను?" టెంపో ప్రశ్నించాడు. విశ్వకర్మారావు మాటలు మరచిపోయాడు. విపరీతమైన ఆశ్చర్యం అతన్ని మూగవాణ్ని చేసేసింది.

"నేలమాళిగలో తవ్విన గొయ్యి ఎవరికోసం? అతని కోసమేనా?...." టెంపో మళ్ళీ ప్రశ్నించాడు; ఎగతాళిగా.

"కమాన్ స్పీక్!" ఇన్‌స్పెక్టర్ అరిచాడు.

"ఫర్వాలేదు, ఇన్‌స్పెక్టర్. అతను నా ప్రశ్నలకి కళ్ళతో సమాధానాలు చెప్తున్నాడు!" టెంపో నవ్వుతూ అన్నాడు. విశ్వకర్మారావు గాభరాగా చూశాడు.

"ఇన్‌స్పెక్టర్. కొన్ని ప్రశ్నలకి అతను నోటితో జవాబులు చెప్పాలి. ముగ్గుర్నీ హెడ్‌క్వార్టర్స్‌కి తీసుకెళ్దాం. అక్కడ మీ పద్ధతుల్లో మీరు ప్రశ్నిస్తారు. కటింగ్ ప్లయర్ ఒక్కొక్క గోటినీ వొలిచిపారేస్తూంటే

విశ్వకర్మారావు ఒక్కో ప్రశ్నకీ రాగయుక్తంగా సమాధానం చెప్తాడు. అవసరమైతే మూడు కటింగ్ ప్లయర్లు ఉపయోగించి ముగ్గురిచేతా బృందగానం పాడించండి! పదండి, పదండి, మనకి అట్టే టైమ్ లేదు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

మొదటిసారిగా టెంపో తతిమ్మా యిద్దరివైపూ చూశాడు. ఇద్దరి మొహాలూ తెల్లగా వున్నాయి. ఒకతని కళ్ళల్లో తడి మెరుస్తోంది.

"విశ్వకర్మారావ్.... చెప్పెయ్...." గజపతి బొంగురుగా అన్నాడు. అతని కళ్ళల్లో తడి ఎక్కువైంది.

విశ్వకర్మారావు బరువుగా నిట్టూర్చాడు. "చెప్తే.... శిక్ష....పడకుండా....చూస్తారా....?" తడబడుతూ ప్రశ్నించాడతను.

"చూద్దాం. త్వరగా అంతా చెప్పెయ్!" టెంపో హెచ్చరించాడు.

"కిరీటాన్ని బలరామ్, గుప్తా దగ్గరికి తీసికెళ్ళాడు...." విశ్వకర్మారావు ప్రారంభించాడు. అయిదు నిమిషాల్లో తనకి కావాల్సిన ఇన్ఫర్మేషన్ని డిటెక్టివ్ టెంపో అతన్నుండీ గుంజుకున్నాడు.

"పృథ్వీరావ్, వైర్లెస్ మెసేజ్ పంపు. వీళ్ళని యిద్దర్నీ తీసికెళ్ళడానికి బాజాభజంత్రీలతో మీ వాళ్ళని దూసుకురమ్మను. ఇక్కడ తగినంతమందిని వుంచు. మనం వెళ్ళేక బలరామ్ ఇక్కడికి రావొచ్చు. అతనికి తూటాలతో స్వాగతం చెప్పే యేర్పాటు చేయ్! విశ్వకర్మారావు మనతో వస్తున్నాడు. అన్నట్టు కారు కోసం

గాలించవద్దని ప్రభంజనంకి చెప్పమను...." అన్నాడు టెంపో.

# 21

తలుపు తెరుచుకుంది; మూసుకుంది. కుంకుమ గదిలో ప్రత్యక్షమైంది. బలరామ్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. కుంకుమ యిక్కడికి యెందుకొచ్చింది? తెరిచి ఉంచిన బోనులోకి ఎలుకలా ఆమె యిక్కడికి యెందుకొచ్చింది? గుప్తా కూడా తనలాగే కంగారుపడుతూ ఆలోచిస్తుంటాడని బలరామ్‌కి తెలుసు.

కుంకుమ సన్నటి నడుముమీద చేతు లుంచుకొని, అందర్నీ కలయజూసింది. ఆమె మొహంలో భయం లేదు. ఆశ్చర్యంలేదు. ఎర్రటి పెదవుల సందులోంచీ తెల్లటి పళ్ళు మెరుస్తూన్నాయి. కుంకుమ నవ్వు బలరాంని అరంతాని ఆందోళనతో నింపుతోంది.

"సో. ఎవ్విరిథింగ్ ఈజ్ అండర్ కంట్రోల్!" అందామె ఇన్‌స్పెక్టర్ని చూస్తూ ఇన్‌స్పెక్టర్ సగర్వంగా నవ్వాడు.

"కుమ్....కుమ్....!" గుప్తా ఆశ్చర్యంతో అరిచాడు.

కుంకుమ అతన్ని సూటిగా చూసింది. "షటప్!" ఆమె కంఠం పిస్టల్ షాట్‌లా ధ్వనించింది.

బలరామ్ రెప్ప వేయకుండా చూస్తున్నాడు. కుంకుమ....కుంకుమ....నాటకం ఆడింది! గుప్తాకీ, తనకూ ఒకేసారి వాత పెట్టింది! సందేహంలేదు. ఆమె పోలీసుల తరఫున మొదట్నుంచీ పని చేస్తూ తనతో, గుప్తాతో నటించింది! ఛిచ్!...బలరామ్ కసిగా అనుకున్నాడు. అతని పిడికిళ్ళు బిగుసుకొన్నాయి. బిగించిన పిడికిలితో కుంకుమ మొహంమీద నవ్వుని తుడిచేయా లనిపిస్తోం

పతనికి.

కుంకుమ వయ్యారంగా సూట్ కేసుల వైపు నడిచింది. కళ్ళు పెద్దవి చేస్తూ నోట్లకట్టల్ని చూసింది. "గుప్తాకి అంతా రెడీగా ఉంచుకున్నాడన్నమాట!" అందామె ఎగతాళిగా.

"ఇది....ఇది....అన్యాయం! నమ్మకద్రోహం!" గుప్తా కీచుగా అరిచాడు.

కుంకుమ అతన్ని ఎగతాళిగా చూసింది. "అలాగా!" అందామె నవ్వుతూ. ఆమె తల ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగింది.

"నా సహకారానికీ, సహాయానికీ ప్రతిఫలంగా ఆ సూట్ కేసుల్ని తీసుకొంటాను. కిరీటాన్నీ, ఆ రాజునీ, ఈ చక్రవర్తినీ మీరు స్వాధీనం చేసుకోండి!" అందామె బలరామ్‌నీ, గుప్తానీ చూపిస్తూ.

"నో!" గుప్తా బడితెదెబ్బ తిన్న బలిసిన పందిలా అరిచాడు. "ఆ డబ్బు....ఆ డబ్బు నాది! కిరిటాన్నీ, దొంగనూ పట్టుకెళ్ళిపొండి. నన్నూ, నా డబ్బునీ వదిలేయండి!"

"మిస్టర్ గుప్తా, నువ్వు నేరం చేశావ్. వజ్రకిరీటాన్ని దొంగసొత్తును దొంగతనంగా కొన్నావు...." ఇన్‌స్పెక్టర్ ఏదో చెప్పబోయాడు.

"నో! నేను కొనలేదు! కొనే ప్రయత్నం కూడా చేయలేదు! వాడు అమ్మే ప్రయత్నం చేశాడు. అది నా తప్పుకాదు! నేను నేరం చేశానని మీరు నిరూపించలేరు" గుప్తా అరిచాడు.

ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వాడు. "వజకిరీటం కోసం నువ్వూ, బలరామ్ సాగించిన గూఢుపురాణీ మొదట్నుంచీ

మాకు తెలుసు. మిస్ కుంకుమ దాన్నంతా బుర్రకథలా కోర్టులో చెప్పింది!"

గుప్తా నీళ్ళల్లో మునిగిపోతున్న ఈత రాని వ్యక్తిలా చూశాడు.

"సూట్ కేసుల్ని నాకు ప్రెజెంట్ చేస్తే గుప్తా గురించి నేను 'నేను పూర్తిగా మరిచిపోతాను!" కుంకుమ నవ్వుతూ అంది.

బలరామ్ ఎర్రటి కళ్ళతో అయోమయంగా చూస్తున్నాడు. గుప్తా కళ్ళు మెరిశాయి. కోర్టులో పరువు ఖరాబు అవడం కన్నా బ్లాక్ మనీలో మూడో వంతు పోవడం నయమే! పరువుంటే తను మళ్ళీ బరువెక్కొచ్చు....

"ఇచ్చేస్తాను! నన్నొదిలేయండి! నా గురించి పూర్తిగా మరిచిపొండి! ...." గుప్తా ఆవేశంతో ఆర్తంగా అరిచాడు.

ఇన్స్పెక్టర్ పొట్టిగా వున్న క్రాపుని ఒకసారి గోక్కున్నాడు. గుప్తావైపూ, కుంకుమవైపు ఆలోచిస్తూ చూశాడు.

"ఒప్పుకోండి, ఇన్స్పెక్టర్. దొంగిలించబడిన కిరీటం, దొంగా మీకు చిక్కారు. గుప్తా గురించి మీ రెక్కడా అనక్కర్లేదు! నేనూ అనను; నా పారితోషికం నాకొస్తే!" కుంకుమ నవ్వింది.

ఇన్స్పెక్టర్ తల పంకిస్తూ వుండిపోయాడు. "ఓ.కే." అన్నాడు చివరికి.

బలరామ్ తన కళ్ళనీ, చెవుల్నీ నమ్మలేకుండా ఉన్నాడు. కుంకుమ తెలివిగా సంపాయిస్తున్న పారితోషికంలో ఇన్స్పెక్టర్ వాటా యెంత? తోడుదొంగ,

లుచ్ఛా, నమ్మకద్రోహి, గుప్తా తెలివిగా తప్పించుకుంటున్నాడు! బలరామ్ పళ్ళు కొరుక్కున్నాడు.

"ఇందులో గుప్తా హస్తం ఉంది. నేను నోరు మూసుకొని కూచోను. నేను మునిగితే, గుప్తా కూడా నాతో బాటు లోపలికంటా మునిగిపోతాడు!" అన్నాడతను కసిగా.

మొట్టమొదటిసారిగా మాట్లాడిన బలరామ్‌ని ఇన్‌స్పెక్టర్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

"చెప్పే అవకాశం నీ కుండదు బాస్!" కుంకుమ ఎగతాళిగా అంది.

"ఏమిటి నీ అర్థం?" బలరామ్ అరిచాడు.

"పవిత్రమైన జ్ఞానపర్వతంమీద, ప్రత్యక్ష దైవ స్వరూపులైన స్వామీజీ వజ్రకిరీటాన్ని తస్కరించిన నీచుడి మాటను ఎవ్వరూ నమ్మరు, బలరామ్!" ఇన్‌స్పెక్టర్ గంభీరంగా అన్నాడు.

కుంకుమ నవ్వు ఆ మాటల్ని అండర్ లైన్ చేసింది.

బలరామ్ మౌనంగా ఉండిపోయాడు. అతనిలో. తెలివిగా తప్పించుకున్న గుప్తా గురించిన ఆలోచనలు సలుపు పుట్టిస్తూ సాగుతున్నాయి. కన్ను లొట్టపోయినా గుప్తాకి చావు తప్పింది. తనకి.... శిక్ష .... ఘరానా దొంగగా పబ్లిసిటీ. నిరంతరం తనమీద ఎర్ర టోపీల ఎర్ర కన్ను....

గుప్తా కడుపు మరో రకంగా మండుతోంది. బలరామ్‌కి పెద్దగా వాటిల్లే నష్టం లేదు. ఆ మాటకొస్తే నష్టమే లేదు! కొంతకాలం ప్రభుత్వ భోజనంతో జైలు శిక్ష. అంతే! తనకి అద్వాన్నా. సూట్ కేసుల్లోది కలిపి కోటికి పైగా తిరుక్షౌరం....

"ఇన్‌స్పెక్టర్, మీ వాళ్ళచేత ఈ సూటుకేసుల్ని

కాల్లో పెట్టించండి. గుప్తా శరీరంకన్నా అవి బరువుగా వున్నట్టున్నాయి!" కుంకుమ కంఠం గుప్తా హృదయం మీద వాత పెట్టింది.

బలరాంని తన రివాల్వర్‌తో కంట్రోల్ చేస్తూ ఇన్‌స్పెక్టర్ దగ్గరగా నడిచాడు. "వన్ వన్ టూ, ఇతనికి బేడీలు వెయ్!" అంటూ ఆక్షేపణగా బలరాం కళ్ళల్లోకి చూశాడతను. "వెనక్కి తిరుగు!"

బలరాం మెల్లిగా వెనక్కి తిరిగాడు. రివాల్వర్ కొన అతని చెవి వెనక గుచ్చుకుంది. వెనుకనున్న అతని రెండు చేతుల్నీ కలుపుతూ బేడీలు క్లిక్‌మన్నాయి. రివాల్వర్ దూరంగా జరిగింది. ఏదో చెయ్యి అతని భుజంమీద బలంగా పడింది. విసురుగా అతను వెనక్కి తిప్పబడ్డాడు. ఇన్‌స్పెక్టర్ కళ్ళు అతన్ని తీక్షణంగా చూశాయి.

"మాస్టర్ బ్రెయిన్!" బిగించిన పళ్ళ సందుగుండా ఇన్‌స్పెక్టర్ ఉచ్చరించాడు. అతని ఎడమచెయ్యి తటాలున కదిలింది. అరచేతి వెనుకభాగం బలరాం ఎడమ చెంప మీద వాలి, ఫట్ మంటూ చప్పుడు చేసింది.

బలరాం బుగ్గ బూరెలా పొంగుతోంది. దవడలోంచీ రక్తం అతని నాలుకమీదికి జారింది. బలరామ్ ఆగ్రహంతో చూశాడు.

"ఇన్‌స్పెక్టర్, నిష్కారణంగా నామీద చేయి చేసుకున్నావ్. యూ హావ్ నో రైట్ టు...."

"షటప్! ఇక్కణ్నుంచీ తీసుకెళ్ళాక నీమీద కాలు కూడా చేసుకుంటాను, బాస్టర్డ్!" ఇన్‌స్పెక్టర్ హుంకరించాడు.

అతని సైగతో కానిస్టేబుల్స్ యిద్దరు రెండు వాటు

కేసుల్ని పట్టుకెళ్ళారు. ఏడుపుని దిగమింగుతూ గుప్తా సూట్ కేసుల్ని చూస్తున్నాడు. మంగూ అసంకల్పితంగా ఆబోతులా బుసకొట్టాడు.

"గుప్తా, నీ తరఫున నీ చింపాంజీ ఏడ్చేలా వుంది!" ఇన్ స్పెక్టర్ నవ్వుతూ అన్నాడు. "గుర్తుంచుకో: తక్కువ పేనులా కిక్కురుమనకుండా పడుండాలి నువ్వు! నోరు తెరిస్తే జెయిలు తలుపు తెరుచుకొంటుంది! అర్థమైందా?"

జవాబుగా గుప్తా నోరు ఆదిమమానవుడి భాషలో ఏవో చప్పుళ్ళు చేసింది.

ఇన్ స్పెక్టర్ బలరామ్ వైపు చూశాడు. బలరామ్ చూపులు అతనిమీద లేవు. తనవేపు చూడకుండా వుంటానికి ప్రయత్నిస్తున్న కుంకుమను రెప్ప వేయకుండా చూస్తున్నాడతను. కుంకుమ యెందుకిలా చేసింది? న్యాయం, ధర్మం, ఇంగ్లాండ్ లాంటి ఆదర్శాలా? అయితే సూట్ కేసుల్లోని భారీ మొత్తాన్ని ఎందుకు తీసింది? ఎందుకు? ఎందుకు?

బలరామ్ మెదడులో యేదో తళుక్కున మెరిసింది. కుంకుమ నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఆమె చట్టంతో, పోలీసులతో సహకరించడం లేదు!

అంటే యీ గదిలో ఉన్న పోలీసులు పోలీసులు కారు!

అందుకే తనతో సహకరించిన యితర వ్యక్తుల గురించి ఇన్ స్పెక్టర్ తనని ప్రశ్నించలేదు!

కుంకుమ అతనికి వాళ్ళ గురించి చెప్పివుండొచ్చు. అయినా, తమ ఒరిజినల్ ప్లాన్ ప్రకారం వాళ్ళు ఆ గదిలో లేరు. విశ్వకర్మారావు నేలమాళిగలో వున్నారు.

ఆ సంగతి కుంకుమకి తెలీదు!

బలరామ్ గుండె దడదడ కొట్టుకోసాగింది. నకిలీ పోలీసులు అసలు పోలీసుల్లా తనని జెయిల్లో పెట్టి కేసు పెట్టరు. తనని....తనని నిర్మూలిస్తారు! మొదటిసారిగా తన నుదురుమీద చెమటలు కమ్ముకున్నాయని బలరామ్ గ్రహించాడు. ఇరుకు పంజరంలో యిరుక్కున్న పిట్టలా అతని గుండె విలవిల్లాడసాగింది. శరీరాన్ని వద్దించిన విసరిలా చేసి, తనని యేమార్చింది; మోసగించింది.

కుంకుమ.... మెల్లిగా తలని అతనివైపు తిప్పింది. ఆమె కళ్ళలో విజయగర్వం సరస్సులమీద సూర్యబింబంలా ప్రతిఫలిస్తోంది. ఏదో మెరుపు బలరామ్ దృష్టిని లాగింది. ఇన్‌స్పెక్టర్ — నకిలీ ఇన్‌స్పెక్టర్ — వజ్రకిరీటాన్ని జాగ్రత్తగా నల్లసంచీలో పెడుతున్నాడు.

"కుంకుమా...." బలరామ్ మెల్లిగా పిల్చాడు. కుంకుమ ఎగతాళిగా చూసింది. ఆమెని దగ్గరగా రమ్మని అతను తలాడిస్తూ సైగ చేశాడు. కుంకుమ తన శరీరాన్ని మెలికలు తిప్పుతూ అతని దగ్గరగా నడిచింది. బలరామ్ ఆమె విశాల నేత్రాల్లోకి తదేకంగా చూశాడు.

"కుంకుమా....నిన్ను నమ్మాను....నన్నెందుకు మోసం చేశావ్?" బలరామ్ మెల్లిగా ప్రశ్నించాడు.

అతని ఎర్రటికళ్ళనీ, పొంగిన బుగ్గనీ, పగిలి రక్తం చిమ్మిన పెదవుల్నీ కుంకుమ చిరునవ్వుతో చూసింది.

"కుంకుమా, అతను పోలీసు కాదు. నాకు తెలుసు. అతనికీ వాటా ఇద్దాము. నన్ను విడిపించు...." బలరామ్ సన్నటి కంఠంతో అన్నాడు.

కుంకుమ కళ్ళు పెద్దవిగా చేసి ఆశ్చర్యంగా చూసింది. మెల్లిగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి.

కిరీటంలోని వజ్రాల్లా ఆమె పళ్ళు తళుక్కుమన్నాయి.

"ఇంటలిజెంట్ బాస్టర్డ్! నీ కళ్ళల్లో మునుపటి గర్వం, దర్పం లేవు. అయామ్ హాపీ!" కుంకుమ తగ్గుస్వరంలో అంది. ఆమె కళ్ళు అతన్ని వెక్కిరిస్తున్నాయి. క్షణకాలం అతని కళ్ళల్లోకి చూసి, ఆమె వెనుతిరిగింది. జీన్స్‌లోంచీ కొట్టొచ్చినట్లు అవుపిస్తోన్న ఆమె పిరుదులు బలరామ్‌ని వెక్కిరిస్తూ గర్వంగా కదిలాయి.

"గుప్తా వీళ్ళు పోలీసులు కారు! దొంగపోలీసులు! కుంకుమతో కలిసి నాటకం ఆడుతున్నారు! నా డబ్బునీ, నీ కిరీటాన్ని తన్నుకుపోతున్నారు!" బలరామ్ బిగ్గరగా అరిచాడు. రెండడుగులు ముందుకు వేసి గుప్తావైపు ఆత్రంగా చూశాడు.

గుప్తా అయోమయంగా చూస్తోన్నాడు. మంగూ కళ్ళు మెరుస్తున్నాయి. తన మాటల్ని మంగూ అర్థం చేసుకొన్నాడని బలరామ్ గ్రహించాడు.

కిరీటాన్ని సంచిలో దోపిన ఇన్స్పెక్టర్ గిరుక్కున బలరాంవైపు తిరిగాడు. అతని కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. వేగంగా బలరాంవైపు కదిలాడతను. చక్రాలమీద కదులుతున్నట్టు ముందుకి జరుగుతున్న మంగూ అతని దృష్టిని ఆకర్షించాడు. సంచీని ఎడంచేతిలోకి మార్చుకుని అతను కుడిచేతిని జేబులోకి పోనిచ్చాడు.

కుంకుమ గిరుక్కున వెనక్కి తిరిగింది. ఆమె చెయ్యి యెప్పుడు యెక్కడికి మారిందో చూడలేదు కానీ, బలరాం ఆమె చేతిలో ప్రత్యక్షమయిన రివాల్వర్ని గాభరాగా చూశాడు. కుంకుమ రెండు అంగల్లో బలరాంని సమీపించింది. ఆమె చెయ్యి గాలిలోకి లేచింది. రివా

ల్వర్ సుత్తిలా బలరాం ముఖం మీదికి గురి పెట్టబడింది.

"అందరూ కదలకుండా నుంచోండి!" గుమ్మంలోంచీ ఎవరో కంఠం హెచ్చరించింది.

ఇన్‌స్పెక్టర్, కుంకుమా, ఉసుక్కున తిరగబోయారు.

"కదిలినవాళ్ళ వొళ్ళు జల్లెడవుతుంది!"

గంభీర కంఠం కర్కశంగా హెచ్చరించింది. కుంకుమ చెయ్యి గాల్లో అచేతనంగా ఆగింది. వోరగా చూస్తున్న ఆమె కళ్ళకి యువకో పోలీసాఫీసర్ విగ్రహం భారీగా అవుపిస్తోంది.

హఠాత్తుగా గదిలోకి వస్తున్న వ్యక్తుల్ని గుప్తా, మంగూ నివ్వెరపోయి చూస్తున్నారు. బలరామ్ కళ్ళు చెదిరినట్టయ్యాయి. పాలిపోయిన ముఖంతో చేతులకి బేడీలతో నిలబడ్డ శవంలా గుమ్మంలో నిలబడ్డ విశ్వకర్మారావుని అతను అయోమయంగా చూశాడు. మెల్లిగా గదిలోకి వస్తున్న ఇద్దరు వ్యక్తుల్నీ అతను ఎన్నోసార్లు చూసివున్నాడు. డిటెక్టివ్ టెంపో. క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్. గుమ్మంలో విశ్వకర్మారావు వెనక నలుగురు సాయుధపోలీసులు అలర్టుగా నిలబడ్డారు.

"కుంకుమా, రివాల్వర్ని కిందపడేయ్. చేతిని కదపకు. వేళ్ళని వొదులు చెయ్!" డిటెక్టివ్ టెంపో హెచ్చరించాడు. కుంకుమ వేళ్ళు వదులయ్యాయి. రివాల్వర్ కిందపడింది.

"చండీదాస్, నీ పోలీసాట పూర్తయింది రెండు చేతులూ పైకెత్తి, మెల్లిగా ఇటువైపుకి తిరుగు!" టెంపో హెచ్చరించాడు. "కుంకుమా, నువ్వుకూడా!"

ఇన్‌స్పెక్టర్‌గా నాటకం ఆడిన చండీదాస్, కుంకుమా వెనక్కి తిరిగి, భయంనిండిన కళ్ళతో చూశారు. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ చండీదాస్ దగ్గరగా నడిచాడు. రివాల్వర్ని గునపంలా అతని పొట్టలో గుచ్చాడు. అతని పాంటు జేబులోంచీ రివాల్వర్ని తీసి తన జేబులో పడేసుకున్నాడు. కుంకుమ కిందపడేసిన రివాల్వర్ని టెంపో అందుకున్నాడు. చండీదాస్ చేతుల్ని కిందికి దించి పృథ్వీరావ్ బేడీలు తగిలించాడు.

"చండీదాస్, కానిస్టేబుల్స్‌లా నటించిన నీ శిష్యులిద్దరూ రూట్ కేసులో సహా కైట క్షేమంగా వున్నారు. నీ పేరూ, నీ కథా, నీ జాతకం అంతా చకచకా అమరంలా అప్పజెప్పేశారు!" డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

సింహంతోలు కప్పుకున్న గాడిదని చూస్తున్న అసలు సింహంలా పృథ్వీరావ్ చండీదాస్‌ని చూస్తున్నాడు.

తన మొహంలోకి నిప్పులు కక్కుతూ చూస్తున్న ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌ని చండీదాస్ గుటకలు మింగుతూ చూశాడు.

"బలరామ్, నువు నిస్సంకోచంగా టోపీవేసే పార్ట్‌నర్స్‌ని ఎన్నుకున్నావ్. కుంకుమ నిన్ను ఏమార్చిందని తెలుస్తోంది. విశ్వకర్మారావూ, గజపతీ, రాంజోగీ నీకోసం నేలమాళిగలో రెడీగా గొయ్యి తవ్వి వుంచారు!" డిటెక్టివ్ టెంపో అన్నాడు. "నువు మళ్లీ బేడీలు ధరించకుండా నించున్న గుప్తాని చూస్తోంటే, అతనూ నిన్ను చండీదాస్‌కి-నకిలీ ఇన్‌స్పెక్టర్ చండీదాస్‌కి వేలంవేసి అమ్మేశాడని తెలుస్తోంది!"

బలరాం పెదవులు అదురుతున్నాయి. రెప్పవేయ

కుండా టెంపోని చూస్తూండిపోయా డతను.

"గుప్తా....నమ్మకద్రోహి! నాకు విషం యిచ్చే ప్రయత్నం చేశాడు!" బలరాం చాడీ చెపుతున్నట్టు అన్నాడు.

టెంపో చిన్నగా నవ్వాడు. "నువ్వు తయారుచేయించిన కిరీటంలాగే, నకిలీ పార్టనర్స్‌ని తయారుచేసు చేసుకున్నావ్!"

విగ్రహాల్లా నిలబడ్డ బలరాంనీ, గుప్తానీ, మంగూనీ, చండీదాస్‌నీ, కుంకుమనీ, డిటెక్టివ్ టెంపో కలయజూశాడు. అందరి మొహాల్లోనూ ఓటమి విశ్వరూపంలో దర్శనమిస్తోంది.

"పృథ్వీరావ్, నీ ఖైదీలందర్నీ కారులో ఇరికించలేవు. టెలిఫోన్ ఉపయోగించు. ఠాణసంచాతో సహా వ్యాను తెప్పించు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ టెంపో, నేను........ నేరం........ చేయలేదు...." గుప్తా ప్రారంభించాడు. డిటెక్టివ్ టెంపో నవ్వు అతన్ని ఆపింది.

"గుప్తా, ఘరానా పెద్దమనిషిగా చెలామణీ అవుతున్న నీ మాటల్ని, సాధారణంగా యెవరేనా నమ్ముతారు. కానీ, వజ్రకిరీటం బేరానికి మొదట్నుంచీ నువ్వు పెట్టుబడి పెట్టావని విశ్వకర్మారావూ, అతని యిద్దరు మిత్రులూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. కాసేపట్లో బలరాం కుంకుమా యిద్దరూ వాళ్ళతో శ్రుతి కలుపుతారు! చాలా కాలంగా దొంగలకి దొరలా రాణించిన నువ్వు దొంగగా దొరికిపోయావ్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"టెంపో, ఐజీగారు నీతో మాట్లాడతారు...." ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ టెలిఫోన్ రిసీవర్ని టెంపోవైపు

చాచాడు.

బొంపా రిసీవర్ని చెవికి ఆనించాడు. ఆవేశంతో ఐజీ చెపుతున్న మాటల్ని చిరునవ్వుతో విన్నాడు.

"ఓ థాంక్స్. జ్ఞానపర్వతం మీదికి ఫోన్ చేయండి. వజ్రకిరీటం గురించి మీ నోటితో మీరే చెప్పండి! కాసేపట్లో అక్కడుంటాం. మీరూ పృథ్వీరావ్ కిరీటాన్ని కొండమీదికి తీసికెళ్ళండి...."

"... ... ..."

"అలాగే. నేనూ వస్తాను. అంతా కార్లో వివరిస్తాను...."

"... ... ..."

"యస్. స్వామీజీకి టోపీ వేసి, వజ్రకిరీటం కొట్టేయడానికి ప్రయత్నించిన వాళ్ళందరికీ అది ముళ్ళ కిరీటం అయింది!" బొంపా నవ్వుతూ అన్నాడు.

"... ... ..."

"ఐజీగారూ, అయామ్ సారీ. ఆశీర్వాదాలు అన్నం పెట్టవు! నేను ప్రయివేట్ డిటెక్టివ్ని. పాటుపడినందుకు ప్రతిఫలం కావాలి!" బొంపా నవ్వుతూ అన్నాడు. "అన్నట్టు ప్రభంజనంని అక్కడే ఉండమనండి. అడ్వెంచర్ సాగించిన వాళ్ళందర్నీ, వజ్రకిరీటాన్ని తిరిగి సంపాయించిన ఇన్స్పెక్టర్ పృథ్వీరావునీ తన కెమెరాలో బంధిస్తాడు!" అంటూ బొంపా రిసీవర్ని పడేశాడు.

కెమెరా అనగానే బిక్కచచ్చిపోయిన వాళ్ళందర్నీ చిరునవ్వుతో చూస్తూ, ఉషారుగా సిగరెట్ వెలిగించాడు.

—: అయిపోయింది :—